ఉక్కు ఉద్యోగులకు జీతాలపై చర్చలు

- రీజనల్ లేబర్ కమిషనర్ వద్ద నోరు మెదపని ప్రతినిధులు
- సమ్మెకు దిగాల్సి ఉంటుందని సీఐటీయూ హెచ్చరిక



రీజనల్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఆర్ఐఎన్ఎల్ అధికారులు, సీఐటీయూ నాయకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

ఉద్యోగులు, కార్మికులకు జీతాల చెల్లింపుపై విశాఖపట్నం స్టీల్ ప్లాంటు (ఆర్ఐఎన్ఎల్) యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వకుండా నీళ్ల నమిలింది. దీంతో సీఐటీయూ ప్రతినిధులు వచ్చే నెలలో సమ్మె తప్పదని స్పష్టంచేశారు. ఆరు నెలలుగా పూర్తి జీతాలు ఇవ్వకుండా వేదిస్తున్నారంటూ సీఐటీయూ నాయకులు అక్కయ్యపాలెంలోని కేంద్ర రీజనల్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇరు వర్గాలను మంగళవారం చర్చలకు పిలిచారు. యాజమాన్యం తరపున ఫైనాన్స్ డీజీఎం ఎస్.రాంప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ వైహెచ్ శంకర్, సీఐటీయూ తరపున ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అయోధ్యరామ్ పాల్గొన్నారు. డిసెంబరు 2024 నుంచి ఇప్పటివరకూ స్టీల్ అమ్మకాల ద్వారా రూ.6,200 కోట్ల ఆదాయం వచ్చిందని, అయినా జీతాలు అరకొరగా ఇస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులను రీజనల్ లేబర్ కమిషనర్ ప్రశ్నిస్తే వారు సరైన జవాబు ఇవ్వలేదు. యాజమాన్యం దృష్టికి తీసుకువెళతామన్నారు. తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రీజనల్ కమిషనర్ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు

... మిగతా 6వ పేజీలో



శివరాత్రిని పురస్కరించుకుని కేఆర్ఎం కాలనీలోని ఉమామహేశ్వర ఆలయానికి విద్యుత్ దీపాల అలంకరణ

నేడు మహా కుంభాభిషేకం

- ప్రయాగరాజ్ నుంచి తీసుకువచ్చిన జలాలతో శివలింగాలకు అభిషేకం
- మధ్యాహ్నం 3 గంటలకు శివపార్వతుల కల్యాణం
- కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి వెల్లడి

మహారాణిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం నగరంలోని ఆర్కే బీచ్‌లో మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్టు కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుబ్బిరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా 40వ మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా నుంచి తీసుకువచ్చిన జలాలు, పంచామృతం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో ఉదయం తొమ్మిది గంటలకు

... మిగతా 6వ పేజీలో



ఆర్కే బీచ్‌లో ఏర్పాటుచేసిన భారీ శివలింగం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న టి.సుబ్బిరామిరెడ్డి, తదితరులు

స్వచ్ఛ సర్వేక్షణ్... మహా టెన్షన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో ఈసారి జీవీఎంసీ ప్రదర్శనపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది పరిశుభ్రత నగరాల్లో నాలుగో ర్యాంకు దక్కించుకున్న జీవీఎంసీ...ఈ ఏడాది ఆ స్థానాన్ని నిలబెట్టుకోవడం కష్టమేనని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం నగరానికి రానున్నది. అందుకు అనుగుణంగా నగరంలో సన్నద్ధత కనిపించకపోవడంతో ర్యాంకుపై సందేహాలు నెలకొంటున్నాయి.

వచ్చే నెల మొదటి వారంలో నగరానికి కేంద్ర బృందం

- ఇక్కడ చూస్తే పరిస్థితులు అధ్వానం
- గత నెల 17 నుంచి జీవీఎంసీ కమిషనర్ పోస్టు ఖాళీ
- నిలిచిపోయిన క్షేత్రస్థాయి పర్యటనలు
- అధికారులు, సిబ్బందిలో నిర్లిప్తత
- దిగజారిన పారిశుధ్యం
- ఇదే పరిస్థితి కొనసాగితే గత ఏడాది సాధించిన ర్యాంకును నిలబెట్టుకోవడం కష్టం



రాష్ట్రంలో అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా జీవీఎంసీకి గుర్తింపు ఉంది. అలాంటి కార్పొ రేషన్‌లో గత నెల 17 నుంచి కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. కమిషనర్‌గా పనిచేసిన సంపత్‌కుమార్‌ను మునిసిపల్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్‌కు ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలు అప్పగించింది. కలెక్టర్ తన బాధ్యతలతో నిత్యం బిజీగా ఉంటుండడంతో జీవీఎంసీ కార్యకలాపాలపై లోతుగా దృష్టిసారించేందుకు సమయం ఉండడం లేదు. కేవలం ముఖ్యమైన ఫైళ్ల మాత్రమే ఆయన చూస్తున్నారు.

పూర్తిస్థాయి కమిషనర్ ఉన్నప్పుడు ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లేవారు. అక్కడ పారిశుధ్య నిర్వహణ తీరు, డ్రైనేజీలు, రోడ్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించ డంతోపాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకునేవారు. అలాగే పచ్చదనం, నగర సుందరీకరణ, గ్రీన్ బెల్ట్, పార్కుల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు వంటి విషయాల్లో అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీచేయడం, సూచనలు ఇవ్వడం చేసేవారు. అధికారులు మరుసటిరోజు ఆయా అంశాల్లో సాధించిన పురోగతిని కమిషనర్‌కు తిరిగి వివరించేవారు. దీనివల్ల నగరంలో సమస్యలు పరిష్కారం కావడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో పురోగతి కనిపించేది. కానీ గత 45 రోజులుగా పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో

... మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం



మొత్తం 22,493 మంది ఓటర్లు

- ముగిసిన ఎన్నికల ప్రచారం
- రేపే పోలింగ్.. ఏర్పాట్లు పూర్తి
- ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి
- అభ్యర్థులతో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సమావేశం

ప్రజల రోజువారీ జీవనంలో ఆర్‌బీఐ పాత్ర కీలకం

- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



- వార్తలు 8లో

ఏయూకు ఎందుకంత నిర్లక్ష్యం!?

ఫార్మా అండ్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు 14 నెలల కిందట రూ.5 కోట్ల విలువైన పరికరాలు కొనుగోలు

- ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాని వైనం
- వారంటీ గడువు కూడా ముగిసినట్టు సమాచారం
- ల్యాబ్ సిద్ధం కాకపోవడమే కారణం



ఏయూ సైకాలజీ విభాగం ఎదురుగా నిర్మించిన 'ఎలిమెంట్' భవనం

- ఇంజనీరింగ్ కళాశాలకు మంజూరైన ల్యాబ్ విషయంలోనూ అదే పరిస్థితి
- రూ.4 కోట్ల పరికరాలు వెనక్కి...

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు రూ.5 కోట్ల విలువైన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. సుమారు 14 నెలల కిందట కొనుగోలు చేసిన ఈ పరికరాలకు వారంటీ కూడా ముగిసిపోయినట్టు తెలిసింది. వివరాలు ఉన్నాయి.

'రూసా' నిధులతో వర్సిటీలో సైకాలజీ విభాగం ఎదురుగా కొన్నాళ్ల కిందట సువిశాలమైన భవనాన్ని నిర్మించారు. 'ఎలిమెంట్' అని పేరు పెట్టారు. 2023 జూలైలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభింపజేశారు. నూతన భవనంలో ఫార్మా అండ్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. టెస్టింగ్‌తో పాటు మందుల ఉత్పత్తి వ్యయం తగ్గేందుకు అవసరమైన పరిశోధనలు నిర్వహించేందుకు గాను అత్యాధునిక పరికరాలను సమకూర్చు కునేందుకు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ నిధులు మంజూరు చేసింది. తొలి దశలో విడుదల చేసిన రూ.5 కోట్లతో సుమారు 14 నెలల కిందట అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేశారు. అయితే, నెలలు గడుస్తున్నా ఆ పరికరాలను ఇప్పటి వరకూ వర్సిటీ అధికారులు ఇన్‌స్టాల్ చేయలేదు. ఇప్పటికీ ప్యాకింగ్‌లలోనే ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం ల్యాబ్ పూర్తి స్థాయిలో

... మిగతా 6వ పేజీలో

మార్కెటింగ్ మాయ!

విశాఖపట్నం/గాజువాక/అచ్యుతాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వం ఒకటి చెబితే... వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు మరొకటి చేస్తున్నారు. దీనివల్ల స్థానిక రైతులు నష్టపోతున్నారు. నగరంలోని రైతుబజార్లలో మంగళవారం ఉదయం టమాటా కిలో ధర రూ.12గా బోర్డుపై రాశారు. సాయంత్రం రూ.14 చేశారు. ఇలా ఉదయం ఒక రేటు, సాయంత్రం ఒక రేటు పెట్టిన సందర్భాలు ఎప్పుడూ లేవు. దీనిపై ఆరా తీస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.



అచ్యుతాపురంలో పారబోసిన టమాటాలు. (ఇన్‌సెట్‌లో) గాజువాక రైతుబజారు బోర్డులో కిలో రూ.14 రేటు

రైతుబజార్లలో గిమ్మిక్కులు

- టమాటా ఉదయం కిలో రూ.12, సాయంత్రం రూ.14
- అచ్యుతాపురం సరకుకు ఒక రేటు, అనంతపురం సరుకైతే మరో రేటు
- వివక్ష తగదని వాపోతున్న స్థానిక రైతులు

టమాటా విస్తారంగా పండడంతో ధర పడిపోయింది. రవాణా చార్జీలు కూడా రావడం లేదని కొందరు రైతులు కోయకుండా పొలంలోనే వదిలేస్తున్నారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో రైతులను ఆదుకోవాలని, వారి పంటను రైతుబజార్లలో విక్రయించుకోవడానికి అవకాశం కల్పించాలని ఆదేశించింది. దాంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో తిరిగి రైతుబజార్లకు వచ్చి ఉత్పత్తులు అమ్ముకోవాలని సూచించారు. విశాఖ రైతుబజార్లకు 80 శాతం వ్యవసాయ ఉత్పత్తులన్నీ అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచే వస్తాయి. ఇదిలావుండగా అచ్యుతాపురం పరిసర గ్రామాలలో సుమారు 300 మంది రైతులు టమాటా వేశారు. వారికి స్థానికంగా 25 కిలోలకు రూ.150 నుంచి రూ.200కు మించి ధర రావడం లేదు. ఆ విషయం తెలిసి అక్కడకు వెళ్లిన డిప్యూటీ డైరెక్టర్, తదితరులు విశాఖపట్నం రైతుబజార్లకు వచ్చి అమ్ముకోవాలని సూచించారు. దాంతో వారు మంగళవారం గాజువాక, గోపాలపట్నం, కంచరపాలెం, అక్కయ్యపాలెం తదితర బజార్లకు వచ్చారు. ఉదయం కిలో ధర రూ.12 పెట్టారు. సాయంత్రం దానిని రూ.14గా మార్చారు. సాయంత్రం బజార్‌కు వచ్చిన సరకును అనంతపురం నుంచి తెప్పించామని, అందువల్ల కిలో రూ.14కి విక్రయించాలని అధికారులు ఆదేశించారు. దాంతో రైతులు హతాశులయ్యారు. ఇక్కడ రోజుకు 20 టన్నుల పంట అందుబాటులో ఉండగా, దానిని అమ్మడానికి ఏర్పాట్లు చేయకుండా, ఎక్కడి నుంచో అనంతపురం నుంచి తెప్పించి, ఇక్కడ స్థానిక రేట్ల కంటే ఎక్కువకు

... మిగతా 6వ పేజీలో

అర్ధరాత్రి హత్య

- వృద్ధుడిని తలపై బండరాయితో మోది హత్య చేసిన యువకుడు
- మద్యం మత్తులో ఘాతుకం



హత్యకు గురైన ఆనందరావు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం/ఎంవీపీ కాలనీ/వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

మద్యం మత్తులో ఒక యువకుడు విచక్షణ కోల్పోయి బండరాయితో తలపై మోది వృద్ధుడిని హత్య చేశాడు. వెంకోజీపాలెం జంక్షన్‌లో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లోని పాత రఘు కాలేజీ సమీపంలో నివాసం ఉంటున్న కనటి ఆనందరావు (67) తాపీమేస్త్రీ. మద్యానికి బానిసైన ఆనందరావు నరాల సమస్యతోపాటు మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. ఆనందరావును కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి

... మిగతా 6వ పేజీలో

టీడీఆర్ హబ్ ప్రవేశాలపై గందరగోళం



పరిశోధకులకు ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు, వైవా నిలిపివేయాలంటూ గత నెలలో ఉత్తర్వులు

- తాజాగా ప్రక్రియను పునః ప్రారంభించాలంటూ మౌఖిక ఆదేశాలు
- అక్రమాలపై విచారణ అటకెక్కినట్టేనా?

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ (టీడీఆర్) హబ్‌లో ప్రవేశాలపై గందరగోళం నెలకొంది. హబ్‌లో ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు డిపార్టుమెంట్‌ల వారీగా ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు, వైవా నిర్వహించాల్సిందిగా గతంలో అధికారులు ఆదేశాలు జారీచేశారు. అయితే, ఆ ప్రవేశాలపై అనేక ఆరోపణలు ఉన్న నేపథ్యంలో విచారణ చేపట్టాలంటూ కొందరు ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేయడంతో... పరీక్షలు, వైవా నిలిపివేయాల్సిందిగా గత నెలాఖరులో ఉన్నత విద్యా శాఖ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. టీడీఆర్ హబ్ వివరాలను సమర్పించాల్సిందిగా కోరడం జరిగింది. దీంతో ప్రవేశాల ప్రక్రియలో లోటుపాట్లన్నీ బయటకు వస్తాయని అంతా భావించారు. అయితే, నిలిపివేసిన ప్రక్రియను మళ్లీ ప్రారంభించాలంటూ నాలుగు రోజుల కిందట ఏయూ అధికారులకు ఉన్నత విద్యా శాఖ అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. నాలుగు వారాల వ్యవధిలోనే భిన్నమైన ఆదేశాలు ఇవ్వడానికి కారణాలేమిటో ఎవరికీ అంతుబట్టడం లేదు. టీడీఆర్ హబ్ ప్రవేశాలపై వచ్చినన్ని ఆరోపణలు వర్సిటీలో మరో విభాగంపై రాలేదు. వర్సిటీలోని విభాగాలతో సంబంధం లేకుండా వందలాది మందికి హబ్‌లో అడ్డగోలుగా పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారంటూ అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఇందులో అప్పటి ఉన్నతాధికారికి

... మిగతా 6వ పేజీలో

బోరువెల్స్ మరమ్మతుల కోసం ప్రత్యేక వాహనం

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో తాగునీటి సమస్య రాకుండా నివారించేందుకు బోర్‌వెల్స్ మరమ్మత్తులు చేపట్టేందుకు ఏర్పాటు చేసిన మరమ్మతుల రథంను మంగళవారం ఉదయం స్థానిక ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తాగునీటి బోర్లు మరమ్మతులు చేసేందుకు ఈ రథం మండలంలో గల 22 పంచాయతీల్లో పర్యటించి గ్రామాల్లో బోర్‌వెల్స్‌కు మరమ్మతులు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోగ్రామీణ తాగునీటి

యువత సన్మార్గంతో నడవాలి

పీఎం పాలెం సీఐ బాలకృష్ణ



యువతకు సూచనలిస్తున్న సీఐ బాలకృష్ణ

మధురవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా సన్మార్గం వైపు అడుగులు వేయాలని పీఎం పాలెంసీఐ జి.బాలకృష్ణ సూచించారు. మంగళవారం ఆయన పోలీస్ అధికారులతో కలసి స్వతంత్రనగర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో వాలీబాల్ కోర్టుతో పాటు వ్యాయామ ప్రాంగణం, వాకింగ్‌ట్రాక్‌ను పరిశీలించారు. అక్కడ ఉన్న యువకులతో సీఐ మాట్లాడుతూ యువత బెట్టింగ్ యాప్‌లు, గంజాయి తదితర వాటి జోలికి వెళ్లొద్దన్నారు.తల్లితండ్రుల ఆకాంక్ష మేరకు కెరీర్‌పై దృష్టిపెట్టి బుద్ధిగా చదువుకోవాలన్నారు ప్రతిరోజూ క్రీడతో పాటు వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలన్నారు. డిగ్రీ అయిన వెంటనే పోటీపరీక్షలపై దృష్టి నిలిపి ఉన్నత ఉద్యోగాలుసాధించాలని సీఐ సూచించారు.

ఘనంగా అప్పన్న కల్యాణం



ఉభయ దేవేరులతో సింహాచలేశుడు

సింహాచలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువ జామున స్వామివారికి ప్రభాత ఆరాధనలను యథావిధిగా పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించాక పాంచరాత్రాగమశాస్త్ర సింహాచలేశుని కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

రఘువర్మకు మద్దతుగా ప్రచారం

భీమునిపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూటమి ప్రభుత్వ మద్దతుతో పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా ఉపాధ్యాయులను నూకరాజు కోరారు. మంగళవారం ఆయన పలు పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం సాగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంఎస్ ప్రసాద్, కె.నాగరాజు, సంజీవకుమార్, లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

2న సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

భీమునిపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి నూకాలమ్మ ఆలయ వీధిలోని పురాతన రామాలయ పునర్నిర్మాణం పూర్తవ్వడంతో మార్చి 1, 2 తేదీల్లో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు ఆదిఆంధ్ర యువజన సంఘం ప్రతినిధులు తెలిపారు. ఒకటో తేదీ ఉదయం 8.30 గంటలనుంచి విఘ్నేశ్వర పూజ, భగవత్ పుణ్యాహవచనంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో క్షీరాదివాసం, అగ్ని ప్రతిష్ఠాపన, వేద పారాయణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా, ఒకటే తేదీ ఉదయం పట్టణంలోని సాయిబాబా గుడి నుంచి సీతారాముల వారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువస్తామన్నారు. రెండో తేదీ ఉదయం ప్రత్యేక పూజలు జరిపాక ఉదయం 11.21 నిమిషాలకు విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని పేర్కొన్నారు.

సాగర తీరంలో శివరాత్రి ఏర్పాట్లు

- స్నానాలు చేసే వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- అందుబాటులో గజ ఈతగాళ్లు
- మెట్ల వద్ద బండరాళ్లను తొలగించాలని కోరుతున్న భక్తులు



సాగర సంగమ ప్రవేశద్వారం వద్ద మెట్ల మార్గంలో ఉన్న రాళ్లు



దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

భీమునిపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని సముద్ర స్నానాలకు విచ్చేసే భక్తులకు జీవీఎంసీ అధికారులు సాగర తీరంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం లైట్‌హౌస్ తీరంలోని ప్రమాదకర ప్రదేశాలలో స్నానాలు ఆచరించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే, బుధవారం రాత్రి శివరాత్రి పర్వదిన జాగరణ చేసిన తర్వాత మరుసటి రోజు గురువారం సాగర సంగమ ప్రదేశంలో సముద్ర స్నానాలకు అధికసంఖ్యలో భక్తులు తరలివస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులు స్నానాలు చేసిన అనంతరం తీరంలో దుస్తులు మార్చుకునేందుకు వీలుగా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బందితో చెత్తాచెదారాలను ఎత్తి వేయించి డంపింగ్ యార్డుకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

అలాగే పోలీసు అధికారులు బీచ్‌రోడ్‌లో సాగర సంగమ ప్రవేశద్వారం వద్ద పోలీసు ఔట్ పోస్టు, తీరంలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటుచేస్తున్నారు.

మెట్ల వద్ద రాళ్లను తొలగించాలి

ప్రవేశద్వారం నుంచి సముద్ర స్నానాలకు బీచ్‌లోకి దిగే భక్తులకు ప్రమాదకరంగా పెద్ద పెద్ద బండ రాళ్లు మెట్లు దిగువ మెట్టు వద్ద పడి వున్నాయి. వాటన్నింటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి ఉత్సవాలకు పలుగ్రామాల్లో గల శైవక్షేత్రల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రమైన పద్మనాభంలో పురాతన శైవక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పార్వతీ సమేత శ్రీనారాయణేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులపాటు శివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు వీర్రాజు తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే మద్ది, అనంతవరం, రెడ్డిపల్లి, తునివలస, కురపల్లి, విలాస్‌ఖాన్‌పాలెం, తదితర గ్రామాల్లో శివాలయాలు సైతం మహాశివరాత్రి వేడుక కోసం సిద్ధమయ్యాయి.



పద్మనాభం : పూజలకు సిద్ధమైన పురాతన పార్వతీ సమేత శ్రీనారాయణేశ్వరస్వామి ఆలయం

స్వచ్ఛ సర్వేక్షణ్ మెరుగైన ర్యాంకు సాధనలో మహిళలదే కీలక పాత్ర

జీవీఎంసీ ఏడీసీ సోమన్నారాయణ

కొమ్మాది, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖనగరాన్ని అందంగా తీర్చిదిద్దటంలో తెరవెనుక ఉండి అహర్నిశలూ శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలకు ఎంతో ప్రాధాన్యం ఉందని జీవీఎంసీ అదనపు కమషనర్ సోమన్నారాయణ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్- 2024ప్రజాభిప్రాయసేకరణలో భాగంగా పీఎం పాలెం వి.కన్వెక్షన్ హాలులో మంగళవారం పారిశుధ్య సిబ్బంది, పొదుపు సంఘాలు, మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ స్వచ్ఛసర్వేక్షణ్‌లో విశాఖకు మొదటిస్థానంతో పాటు పారిశుధ్యకార్మికుల శ్రమకి తగిన గుర్తింపు తీసుకువవస్తుందన్నారు .జోన్-2 పరిధిలో లక్షకు పైగా నివాసగృహాలు ఉన్నాయని రెండ లక్షలకు పైగా ప్రజలు నివసిస్తున్నారని ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ ఎక్కువగా ఈప్రాంతం నుంచి రావాలని ఆశిస్తున్నామన్నారు. మధురవాడ ప్రాంతంలో నాలుగు వేల అయిదు వందల మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయని, ఒక్కో గ్రూపుకు 50 ఫీడ్‌బ్యాక్ చొప్పున పదిరోజుల వ్యవధిలో నాలుగు నుంచి అయిదులక్షల ఫీడ్‌బ్యాక్‌లు సులభంగా సాధించవచ్చొన్నారు. మహిళలు నడుంబిగిస్తే విశాఖకు మొదటిస్థానం సాధించటం పెద్ద కష్టమేమీ కాదన్నారు.మెరుగైన పనితీరు కనపరచిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్, జడ్సీ కనకమహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిషోర్, ఏపీడీ శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ సోమన్నారాయణ

రఘువర్మకు మద్దతుగా టీడీపీ నేతల ప్రచారం

కొమ్మాది, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మధురవాడ పరిసర ప్రాంతాలో మంగళవారం టీడీపీ నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చంద్రంపాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, 5వార్డు పరిధి కార్పెంటర్స్ కాలనీలోని శ్రీ విద్యా పాఠశాల, చైతన్య టెక్నో పాఠశాల, గురుకుల పాఠశాల తదితర ప్రాంతాల్లో పర్యటించి ఉపాధ్యాయులను నేరుగా కలిసి రఘువర్మను మొదటి ప్రాదాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు మొల్లిలక్ష్మణరావు, పిళ్లా వెంకట్రావు, దాసరిశ్రీనివాస్, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, దేవరశివ, నమ్మి శ్రీను, లొడగల జానకిరామ్, కొండపురాజు, పాఠశాలకమిటీ అద్యక్షుడు అచ్యుతరావు, కమిటత సభ్యులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం సమకూరేనా!

మంత్రి ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు

మధురవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖకు త్వరలో సొంత భవనాలు సమకూర్చుతామని రాష్ట్ర రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇటీవల ప్రకటించడంతో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనంపై ఆశలు చిగురిస్తున్నాయి. విశాఖపట్నం డివిజన్‌లో రిజిస్ట్రేషన్ల వల్ల ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చుతున్న మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇంతవరకు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఈ కార్యాలయం ఇరుకుగా ఉండడంతో రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలతో పాటు సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. గతంలో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇక్కడి రైతుబజారు సమీపంలో మూడెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. కానీ అప్పట్లో పనులు ప్రారంభించకపోవడంతో ఆ ప్రతిపాదనలు మూలకు చేరాయి. తాజాగా మంత్రి సత్యప్రసాద్ అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామని తెలపడంతో విశాఖ రూరల్ మండల రెవెన్యూ అధికారులు కూడా మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సమీప ప్రాంతంలో ప్రభుత్వ భూమిని సమకూర్చే పనిలో ఉన్నట్టు తెలిసింది. స్థలం సమకూరిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమైతే అటు ప్రజలకు, ఇటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి ఊరట కలుగుతుంది.



అద్దె భవనంలో నడుస్తున్న మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్తు

రాష్ట్ర ఫార్మా ఫోరం అధ్యక్షుడు డాక్టర్ నారాయణ

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో రానున్న కాలంలో ఫార్మా విద్యార్థులు కీలక పాత్ర పోషించనున్నారని రాష్ట్ర ఫార్మా ఫోరం అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ అన్నారు. స్థానిక అవంతి ఫార్మా కళాశాలలో మంగళవారం జరిగిన ఫార్మా రంగం భవిష్యత్తు అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మంచి లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ఫార్మాస్యూటికల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.రాజేశ్వరరావు మాట్లాడుతూ తక్కువ దుష్ప్రభావాలున్న కొత్త మందును కనిపెట్టేందుకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. మెడికవర్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ నిమ్మగడ్డ పద్మజ మాట్లాడుతూ రోగుల భద్రత, ఔషధాల వినియోగం, ఆరోగ్య సంస్కరణల్లో ఫార్మాసిస్టులు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆంధ్రా ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియం మాట్లాడుతూ మరుగునపడుతున్న సమాచార సాంకేతిక ఔషధ పరిశోధనలను అందిపుచ్చుకోవాలని కోరారు. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ జి.జయసుమ కృత్రిమ మేధ ద్వారా ఔషధాల పనితీరును విద్యార్థులు బేరీజు వేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.



ఫార్మా సదస్సులో పాల్గొన్న అతిథులతో ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భరతనాట్య ప్రదర్శన ఇస్తున్న లక్ష్మీ పార్థసారథి ఆత్రేయ

ఆకట్టుకున్న లక్ష్మీ పార్థసారథి భరతనాట్యం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యువతలో భారతదేశ శాస్త్రీయ సంగీతం, నృత్య కళలను ప్రోత్సహించడానికి ఏర్పాటైన స్పిక్‌మేకే (సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ యమాంగెస్ట్ యూత్) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రముఖ భరతనాట్య కళాకారిణి లక్ష్మీపార్థసారథి ఆత్రేయ నృత్య ప్రదర్శన ఇచ్చారు. భరతనాట్యం విశిష్టతను తెలియజేస్తూ ఆమె ప్రదర్శన సాగింది.

భక్త కన్నప్ప, భక్త మార్కండేయ భక్తికి మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమై వారిని రక్షించుకున్న కథను లక్ష్మీపార్థసారథి ఆత్రేయ తన అభినయంతో కూడిన నృత్యం ద్వారా చూపరులను ఆకట్టుకున్నారు. ఆమె నృత్యానికి ప్రముఖ కళాకారులు గాత్ర, వాయిద్య సహకారాన్ని అందించారు. తొలుత కార్యక్రమాన్ని గీతం విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ బాలాకుమార్, ఫైన్ అండ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ ఆముక్తమాల్యద జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్టు

ఆనందపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భీమిలి క్రాస్ రోడ్డు జంక్షన్ వద్ద జరిపిన వాహనాల తనిఖీల్లో 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఆనందపురం సీఐ చింతా వాసునాయుడు మంగళవారం తెలిపారు. గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారంపై ఎస్ఐ డి.శివ, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్, సిబ్బందితో భీమిలి క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒక ఆటోను తనిఖీ చేయగా అందులో 25 కేజీల గంజాయి లభ్యమైంది. ఈ మేరకు ఆటోలో ఉన్న మారికవలస ప్రాంతానికి చెందిన శోభా భీమన్న (25), హైదరాబాద్‌కు చెందిన శ్రావణ్ రామ్‌గౌండి (63), అనంతగిరి మండలం కొండిప గ్రామానికి చెందిన గుజ్జల రాంబాబు (33)లను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ పేర్కొన్నారు.

వెన్‌కాబ్ ఆధ్వర్యంలో ఉడికించిన గుడ్లు పంపిణీ

తగరపువలస, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చికెన్, కోడి గుడ్లు తినడం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ మంగళవారం స్థానిక పెట్రోల్ బంక్ వద్ద వెన్‌కాబ్ సంస్థ నిర్వాహకులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉడకబెట్టిన గుడ్లు, చికెక్ కబాబ్ వంటి వాటిని ఉచితంగా పంపిణీ చేశారు. బర్డ్‌ఫ్లూ ప్రభావం ఉత్తరాంధ్రలో లేదని, చికెన్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పిట్టా సురేశ్, ఎస్సీ సెల్ నాయకుడు టి.అప్పలరాజు పౌల్ట్రీ వ్యాపారులు బెహరా రామచంద్రరావు దుర్గాప్రసాద్, మణి, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్... మహా టెన్షన్

... 5వ పేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. అధికారుల తనిఖీలు లేకపోవడంతో కింది స్థాయి సిబ్బందిలో నిర్లక్ష్యం చోటుచేసుకుంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు పూర్తిగా మరుగునపడిపోయింది. గతంలో దుకాణాలు, హోటళ్ల వంటి కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ల వద్ద చెత్త కనిపిస్తే బాధ్యులైన వ్యాపారులకు జరిమానాలు, విధించడం, కేసులు నమోదుచేయడం చేసేవారు. ఇప్పుడు అటువంటి చర్యలు లేకపోవడంతో దుకాణాల పక్కన మళ్లీ చెత్త దర్శనమిస్తోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుపై ప్రభావం

స్వచ్ఛ సర్వేక్షణ్-2024 సర్వే గత ఏడాది జరగాల్సి ఉంది. అయితే సాధారణ ఎన్నికల కారణంగా జరగలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కేంద్ర బృందాలు వివిధ నగరాల్లో పర్యటించి సర్వే చేస్తున్నాయి. అందులో భాగంగా విశాఖకు మార్చి మొదటి వారంలో కేంద్ర బృందాలు వచ్చే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ 2015లో 237, 2016లో ఐదు, 2017లో మూడు, 2018లో ఏడు, 2019లో 23, 2020, 2021లో తొమ్మిది, 2022, 2023 పోటీల్లో నాలుగో ర్యాంకు దక్కించుకుంది. ఈ ఏడాది ర్యాంకు మరింత మెరుగుపడుతుందని భావించినప్పటికీ గత 45 రోజులుగా పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో నగరంలో పారిశుధ్యం దిగజారిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ప్లాస్టిక్ నియంత్రణ, గెడ్డల సుందరీకరణ వంటి అంశాల్లో కూడా వెనుకబాటుతనం కనిపిస్తోంది. ఇటువంటి తరుణంలో కేంద్ర బృందాలు నగరానికి వస్తే ఆయా అంశాలను పరిశీలించి తక్కువ మార్కులు వేసే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులే అంటున్నారు.

అర్ధరాత్రి హత్య

... 5వ పేజీ తరువాయి

తీసుకువెళ్లారు. అక్కడ వైద్యుడికి చూపించిన తర్వాత తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. ఆ సమయంలో మద్యం తాగడానికి కుటుంబ సభ్యులను ఆనందరావు డబ్బులు అడగ్గా, ఇవ్వకపోవడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 11 గంటల సమయంలో వెంకోజీపాలెం జంక్షన్‌లో హనుమాన్ విగ్రహం వద్ద ఉన్న నూడిల్స్ దుకాణం పక్కన ఫుట్‌పాత్‌పై ఆనందరావు కూర్చుని ఉన్నాడు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం చనమల్లుపేటకు చెందిన చనమల్లు శ్రీనివాసరావు (24) రాత్రి 12 గంటల సమయంలో ఆనందరావు కూర్చున్న సమీపంలోని నూడిల్స్ దుకాణం వద్దకు వచ్చాడు. శ్రీనివాసరావు గతంలో సీతమ్మధారలోని రాజుస్ కిచెన్‌లో తందూరీ మాస్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం పీఎం పాలెంలో కొత్తగా ప్రారంభించిన రాజూస్ కిచెన్ బ్రాంచిలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 10.30 గంటలకు పీఎం పాలెంలో పని ముగించుకున్న శ్రీనివాసరావు సీతమ్మధారలోని స్నేహితులను కలిసేందుకు బైక్‌పై వచ్చాడు. స్నేహితుడితో కలిసి వెంకోజీపాలెంలోని ఒక బార్‌లో మద్యం సేవించాడు. అక్కడి నుంచి తనకు పరిచయస్తుడైన నూడిల్స్ షాప్ నిర్వాహకుడి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న శ్రీనివాసరావు నూడిల్స్ దుకాణం పక్కన కూర్చుని ఉన్న ఆనందరావు వద్ద గట్టిగా అరిచాడు. దీంతో ఆనందరావు ఎందుకలా అరుస్తున్నావంటూ? ఆగ్రహం వ్యక్తంచేశాడు. ఆ సమయంలో ఇద్దరూ ఒకరినొకరు తోసుకోవడంతో మద్యం మత్తులో ఉన్న శ్రీనివాసరావు కిందపడిపోయాడు. అనంతరం లేచి ఆనందరావును కొట్టడంతో శ్రీనివాసరావును నూడిల్స్ దుకాణం నిర్వాహకుడు అడ్డుకున్నాడు. కొంతసేపు ఆగిన తర్వాత శ్రీనివాసరావు విచక్షణ కోల్పోయి ఒక్కసారిగా పక్కనే ఉన్న బండరాయిని తీసి ఆనందరావు తలపై మోదాడు. దీంతో ఆనందరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హత్యచేసిన శ్రీనివాసరావు అక్కడి నుంచి భయంతో బైక్‌పై పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో తాను ఉంటున్న రూమ్‌కు వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం పారిశుధ్య నిర్వహణ సిబ్బంది నూడిల్స్ దుకాణం వద్ద ఉన్న ఆనందరావు మృతదేహాన్ని చూసి యాచకుడు చనిపోయాడంటూ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎవరో బండరాయితో మోది హత్య చేసినట్టు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఎంవీపీ కాలనీ స్టేషన్ సీఐ జె.మురళీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

మృతుడి ప్యాంటు జేబులో ఆధార్ కార్డు లభించడంతో అందులోని చిరునామా ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నూడిల్స్ దుకాణం నిర్వాహకుడిని దీనిపై ప్రశ్నించగా మొదట తనకేమీ తెలియదని బుకాయించినప్పటికీ పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో శ్రీనివాసరావు హత్య చేసినట్టు వివరించాడు. నూడిల్స్ దుకాణం నిర్వాహకుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ మురళీ తెలిపారు.

టీడీఆర్ హబ్ ప్రవేశాలపై గందరగోళం

... 5వ పేజీ తరువాయి

సన్నిహితుడొకరు కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన ఉన్నత విద్యా శాఖ నివేదిక వచ్చిన తరువాతే తదుపరి నిర్ణయం తీసుకోవాల్సింది. కానీ అందుకు విరుద్ధంగా ఆదేశాలు ఇవ్వడంపై ప్రొఫెసర్లు ఆశ్చర్యపోతున్నారు. భిన్నమైన ఆదేశాలతో వర్సిటీ అధికారులతోపాటు ప్రవేశాలు పొందిన అభ్యర్థులు, ఆయా విభాగాధిపతులు అయోమయానికి గురవుతున్నారు.

విభాగాలకు కేటాయించే అవకాశం

ఉన్నత విద్యా శాఖ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఏపీఆర్‌సెట్ ద్వారా ప్రవేశాలు పొందిన 685 మందికి తదుపరి దశను ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వీరందరినీ ఆయా విభాగాలకు కేటాయించనున్నారు. వీరికి కేటాయించిన గైడ్ల అర్హతను పరిశీలించి అర్హులైతే కొనసాగించనున్నారు. అనర్హులు ఉంటే వారిని తొలగించి విభాగాధిపతి ఆధ్వర్యంలో కొత్త గైడ్లను కేటాయిస్తారు. అనంతరం ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు, వైవా నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు చెబుతున్నారు. ఆర్‌సెట్ ద్వారా ప్రవేశాలు పొందని వారి విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. కొత్త వీసీ బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఉన్నత విద్యా శాఖ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు వెల్లడించారు.

ఏయూకు ఎందుకంత నిర్లక్ష్యం!?

... 5వ పేజీ తరువాయి

సిద్ధం కాకపోవడమేనని తెలుస్తోంది. ల్యాబ్‌కు తగిన వసతులు ఏర్పాటు చేసేందుకు సుమారు కోటి రూపాయలు ఖర్చవు తుంది. నిధులు ఉన్నప్పటికీ గత వీసీ ప్రసాద రెడ్డితోపాటు ఆ తరువాత వచ్చిన అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఇదిలావుండగా పరికరాలు కొనుగోలు చేసిన సంస్థకు ఇప్పటివరకూ కోటిన్నర మాత్రమే చెల్లించారు. మిగిలిన సొమ్ము బకాయి పెట్టడంతో సదరు సంస్థ కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్టు చెబుతున్నారు. మిగిలిన రూ.3.5 కోట్లు వర్సిటీ వద్ద ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ...వారంటీ గడువు ముగిసినందున ఏదైనా సమస్య వస్తే ఎవరి మెడకు చుట్టుకుంటుందోననే ఆందోళన వ్యక్తమవు తోంది.

నిర్లక్ష్యమే కారణం..

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) అనుమతి లేదన్న కారణంతోనే ఈ ల్యాబ్ పనులను ప్రారంభించ లేదని అధికారులు చెబుతున్నట్టు తెలుస్తోంది. అసలు ప్రతిపాదనను ఈసీలో పెట్టలేదని భోగట్టా. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మొదటి విడత ఇచ్చిన ఐదు కోట్ల రూపాయలను సద్వినియోగం చేసుకుని ఉంటే మరో రూ.5 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. కానీ, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. ఇదిలావుంటే ప్రారంభం కాని ల్యాబ్‌కు వర్సిటీ అధికారులు ఓ అధికారిని నియమించారు. ఫార్మసీ కాలేజీకి చెందిన ఒక సీనియర్ ప్రొఫెసర్‌ను ఎలిమెంట్‌కు కో-ఆర్డినేటర్‌గా నియమించి, నెలకు రూ.75 వేలకుపైగా వేతనాన్ని చెల్లిస్తూ వచ్చారు.

ఇంజనీరింగ్ కాలేజీలో అదే తంతు..

ఇంజనీరింగ్ కాలేజీ పరిధిలో కూడా సీ4ఐ4 ల్యాబ్‌ను ఏర్పాటుచేయాలని అధికారులు భావించారు. ఈ ల్యాబ్‌లో ఏర్పాటుచేసేందుకు సుమారు రూ.4 కోట్లు విలువజేసే పరికరాలను కేంద్రం కొన్నాళ్ల కిందట చేసి పంపించింది. అయితే, ల్యాబ్‌ను సిద్ధం చేయడంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో ఆ పరికరాలను కేంద్రం మళ్లీ వెనక్కి తీసుకుంది.

మార్కెటింగ్ మాయ!

... 5వ పేజీ తరువాయి

అమ్మడం ఏమిటని ప్రశ్నించారు. అందుకు అ ఎస్టేట్ అధికారులు...అంత దూరం నుంచి తెప్పించినందున రవాణా చార్జీలు అవుతాయని, అందుకే రేటు ఎక్కువ పెట్టినట్టు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే స్థానికంగా దిగుమతి అవుతున్న టమాటాను తీసుకోకుండా దూరం నుంచి తెప్పించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విశాఖ, అనకాపల్లి జిల్లాల జాయింట్ కలెక్టర్లు దృష్టిసారించాలని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలపై చర్చలు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ, ఇంతవరకూ శాంతియుతంగా పోరాటం చేశామని, దీనిని యాజమాన్యం అసమర్థతగా భావిస్తోందన్నారు. మార్చి 7వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టంచేశారు. ఈ విషయంలో కార్మికులు అందరినీ కలుపుకొని వెళతామని అయోధ్య రామ్ వెల్లడించారు.

నేడు మహా కుంభాభిషేకం

... 5వ పేజీ తరువాయి

కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు అత్యంత వైభవంగా అభిషేకం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. భక్తులందరూ స్వయంగా అభిషేకాలు చేయవచ్చన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, అనంతరం హోమం జరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రం అందరినీ అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు బ్రహ్మానందం, అవధాని మాడుగుల నాగఫణిశర్మ, తదితరులు విచ్చేస్తారని సుబ్బిరామిరెడ్డి పేర్కొన్నారు.



పంచకర్లను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

వెంకన్న బ్రహ్మోత్సవాలకు పంచకర్లకు ఆహ్వానం

వేపగుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సిందిగా కోరుతూ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు అర్చకులు శ్రీనివాసస్వామి ఆహ్వాన పత్రికను అంద జేసి, సన్మానించారు. మార్చి రెండు నుంచి ఏడో తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొన వలసిందిగా విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు,స్థానిక నాయకుడు సూరిబాబు,తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గను దర్శించుకున్న ఎమ్మెల్యే

పెందుర్తి: మండలంలోని ఎస్ఆర్‌పురంలో గల కనకదుర్గ ఆలయాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు కాయితి ఎర్రిబాబు ఆధ్వర్యంలో స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూది వెంకట విజయలక్ష్మి,రాజాసుధాకర్, అయితి సింహాచలం, గొరపల్లి సోమునాయుడు, మర్రిబాబు పాల్గొన్నారు.

పండగ కరపత్రాలు ఆవిష్కరణ

పెదగంట్యాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 18న నడుపూరులో జరగనున్న పైడిమాంబ పండగకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పైడిమాంబ ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. జాతీయ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్,జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, పైడిమాంబ సమైక్య సంఘం చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చంనాయుడు, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు టి.కాశీవిశ్వేశ్వరరావు, ఎం.ప్రసాద్,బి.నాగభూషణం, బి.కృష్ణారావు, జె.అప్పారావు, సుదర్శన్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశిమాంబ పండగ

అగనంపూడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి గ్రామస్తుల ఆరాధ్య దేవత పరదేశిమాంబ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచే అమ్మవారిని దర్శించేందుకు భక్తులు బారులుతీరారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక ఆలయం వద్దకు తెచ్చి పూజలు జరిపారు. బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు, ఎం.గిరిప్రసాద్,శివాజీ, సతీశ్‌కుమార్, పైడిరాజు, నూకేశ్వరరావు, సంజీవ అప్పారావు,తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
- **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20,వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 42, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 36, బీరకాయలు 60,ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 12, క్యారెట్ 34 దొండకాయలు 32, బంగాళదుంపలు 14, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 52,మునక్కాడలు (కిలో) 62,బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100,కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 32, కీరదోస 24, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 40, గోరుచిక్కుడు 36,కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	480
విజయనగరం	484
శ్రీకాకుళం	484

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	68
లైవ్ ధర	88
విత్ స్కిన్	146
స్కిన్‌లెస్	156



ముస్తాబైన పెందుర్తి రత్నగిరినగర్‌లోని విశాలక్షి విశ్వేశరస్వామి ఆలయం



నరవ గ్రామంలోని ఉమానాగలింగేశ్వరాలయం

మహా శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

భక్తులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు సున్నాలు వేసి విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం శివాలయాల్లో ముక్కంటికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేయనున్నారు. వేకువజాము నుంచే భక్తుల తాకిడి ఉంటుంది కాబట్టి ఎవరూ ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా 87వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లో కాశీ అన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిల ఆధ్వర్యంలో హోమాలు, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శత నామాలు, ద్వాదశాభిషేకాలు, తదితర ప్రత్యేక పూజలు చేయనున్నారు. అలాగే వడ్లపూడిలో బ్రహ్మసూత్ర శివ లింగ ఆలయంలో, 87వ వార్డు కణితి ఉమామహేశ్వర ఆలయం, సంతమామిడితోట శివాలయంలో, 86వ వార్డు సాయిరాంనగర్‌లో 18 అడుగుల శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

అప్పికొండకు ప్రత్యేక బస్సులు

మహా శివరాత్రి సందర్భంగా అప్పికొండ సోమేశ్వరాలయానికి స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో నుంచి బుధవారం సాయంత్రం నాలుగు నుంచి 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. కూర్మన్నపాలెం, వడ్లపూడి, సిద్ధార్థనగర్, యాదవ జగ్గరాజుపేట,రాజీవ్‌నగర్, అగనంపూడి, లంకెలపాలెం ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిచేలా ఏర్పాట్లు చేశామని, భక్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెందుర్తి: మండలంలోని శివాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు, అర్చనలు, హోమాలు చేయనున్నారు. సరిపల్లిలోని స్వయంభు మల్లీశ్వరాలయానికి ప్రత్యేకత ఉంది. సరిపల్లిలోని స్వయంభు శివలింగం అతి ప్రాచీనమైనది. ఇక్కడి వ్యవసాయ భూముల్లో సాగు చేస్తున్నప్పుడు శివలింగం కనిపించిందని పూర్వీకులు చెబుతారు. ఈ శివలింగాన్ని పొరుగు గ్రామానికి చెందిన ఓ వ్యాపారి తన ప్రాంతానికి తరలించాలని భావించాడు. కూలీలను పెట్టి శివలింగం వెలసిన చోట తవ్వకాలు చేపట్టగా



87వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లోని ఉమామహేశ్వరాలయం



విద్యుద్దీప కాంతుల్లో షీలానగర్‌లోని శివశక్తి సాయి మందిరం

అంతం కనుగొనలేకపోయారు. శివలింగం శ్వేత వర్ణంతో మెరుస్తుండడంతో స్వయంభు శివాలయానికి మల్లీశ్వరస్వామి ఆలయంగా పేరు పెట్టారు. ముక్కు తిరుపతయ్య కుటుంబీకులు భూ దానం చేసిన స్థలంలో శివశివానీ విగ్రహాలు, ఆలయ ప్రాంగణంలో చండీశ్వరుడు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కాగా పాత పెందుర్తి ప్రశాంతినగర్‌లోని శివాలయాలు,పినగాడిలోని చోడేశ్వరాలయం, సుజాతనగర్‌లో గల హరిహర క్షేత్ర, రత్నగిరినగర్‌లో విశాలక్ష్మీవిశ్వేశ్వరస్వామి, చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని రామలింగేశ్వర స్వామి, వుడాకాలనీ శ్రమశక్తినగర్ శివాలయాల్లో భక్తులు ఇబ్బదులు పడకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

నరవ: నరవ గ్రామంలోని పురాతన శివాలయంలో మహా శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు శతాబ్దం క్రితం ఓ రైతు పంటపొలంలో తవ్వకాలు చేపడుతుండగా భూగర్భంలో శివలింగం బయల్పడింది. అప్పటి నుంచి నిత్య పూజలందుకుంటూ నేడు ఉమానాగలింగేశ్వరాలయంగా ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయంలో ఏటా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. కాగా వ్యవసాయ క్షేత్రాల్లో బయల్పడిన శివలింగాన్ని గ్రామానికి తరలించి ఆలయం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు భావించారు. అయితే శివలింగం తరలించడం కష్టమని భావించి అదే ప్రాంతంలో శంభుడి గుడిగా నామకరణం చేసి పూజలు చేసేవారు. ఈ ప్రాంతానికి సమీపంలో ఓ భారీ స్థూపంతో పాటు నందీశ్వరుడు, వినాయకుడి విగ్రహాలు కూడా బయటపడ్డాయి. అనంతరం వీటిని పురావస్తుశాఖ అధికారులు పరిశీలించగా ఇవి 13వ శతాబ్ధం నాటి విగ్రహాలుగా గుర్తించారు. గడిచిన దశాబ్ద కాలంలో ఈ ఆలయాన్ని ఆధునీకరించి అభివృద్ధి చేశారు. శివరాత్రి పర్వదినాన వేలాది మంది భక్తులు ఆలయానికి వస్తారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపడుతున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69 వార్డుల పరిధిలోని శివాలయాలు శివా రాత్రికి ముస్తాబయ్యాయి. షీలానగర్‌లోని శివశక్తి సాయి మందిరం, నాతయ్యపాలెంలోని కాశీవిశ్వేశ్వరాలయం, అక్కిరెడ్డిపాలెంలోని సాయి సహిత శివ మందిరం, మిందిలోని శివాలయాలు విద్యుత్ దీపాల వెలుగులతో కొత్త శోభను సంతరించుకున్నాయి.

జ్యోతిర్లింగాల దర్శనానికి తరలివచ్చిన భక్తులు

అగనంపూడి: మహా శివరాత్రి సందర్భంగా ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలోని దివ్య జ్యోతి భవన్ వద్ద ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమరీస్ సంస్థ ప్రతినిధులు జ్యోతిర్లింగాల విశిష్టతను భక్తులకు వివరించారు. ప్రతిఒక్కరూ జ్యోతిర్లింగాలను దర్శించుకొని ముక్తిని పొందాలన్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ జిల్లా ఇన్‌చార్జి బీకే వేణి, బీకే సోమేశ్వరి, రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రేటర్ 59వ వార్డు పరిధి గణపతి నగర్‌లో పంచముఖ శివాలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడి శివలింగానికి పంచముఖాలు కలిగి ఉండడం విశేషం. ఈ ఆలయాన్ని 2000 సంవత్సరంలో కొంతమంది నేపాలీలు నిర్మించారు. అంతేకాక నేపాలీ నుంచే పంచముఖ శివలింగాన్ని ఇక్కడకు తీసుకువచ్చి ప్రతి ష్ఠించారు. మహా శివరాత్రి నాడు స్థానికులతో పాటు నేపాలీలు అందరూ కుటుంబ సమేతంగా ఈ ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుంటారు.



59వ వార్డు పరిధి గణపతి నగర్‌లో పూజలందుకుంటున్న పంచముఖ శివలింగం

‘పది’లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి | డీఈవో ప్రేమ్‌కుమార్

అగనంపూడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో అనుసరించాల్సిన విధానాలను వారికి వివరించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరు కావాలని పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థుల సామర్థ్యంపై ప్రశ్నలు వేయగా, వారు సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, సైన్స్ ఉపాధ్యాయిని కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు కలిగిన విద్యనందించాలి

పెదగంట్యాడ: చిన్నారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల పాటు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలలకు గుణాత్మక విద్యను అందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. చిన్నారులను ఉత్తేజపరిచి ఆటపాటలతో కూడిన విద్యనందించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డి.నీలవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని కాలనీల్లో నివాసం ఉంటున్న కుటుంబాల గురించి సర్వే చేసి పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యాక్రమంలో ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, స్కూల్ హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, డీఆర్పీలు ఎస్‌వీఎస్ఎస్ఎల్ఎన్ మూర్తి, ఎన్.సూరిబాబు, షేక్ రంజాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.సుజాత, ఎ.లక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేస్తుకున్న అంగన్‌వాడీ టీచర్లకు డీఈవో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్



87వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించాలని ‘పల్లా’ ప్రచారం

కూర్మన్నపాలెం/అగనంపూడి/అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూటమి ప్రభుత్వ మద్దతుతో పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు తొలి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించవలసిందిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు టీచర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన 87వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్నాథం, నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, సిరసపల్లి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అగనంపూడిలోని పలు పాఠశాలలకు పల్లా వెళ్లి రఘువర్మను గెలిపించాలని కోరారు.ఆయన వెంట కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, నాయకులు కర్రి దోశేంద్ర,రమేశ్, బి.చందు, అప్పారావు, కె.తిలక్, వెంకటరావు, అచ్యుత్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రఘువర్మను గెలిపించాలంటూ 68వ వార్డులో పల్లా శ్రీనివాసరావు ప్రచారం సాగించారు. మింది, అక్కిరెడ్డిపాలెం హైస్కూళ్లలో ఉపాధ్యాయులను కలిసి రఘువర్మకు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలన్నారు. ఆయన వెంట నాయకులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, ఈటి శ్రీను, జి.నరసింహమూర్తి, బొడ్డు రమణ, డొప్ప అప్పలరాజు, గండికోట తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు, తదితరులు

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆళ్వార్స్ విద్యార్థుల ప్రతిభ

వేపగుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం బంకు సమీపంలోని ఆర్ఆర్‌వీపురం ఆళ్వార్స్ క్యాంపస్‌లో తమిళనాడుకు చెందిన రాయల్ ఇన్‌ఫీల్డ్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలో 102 మంది ఆళ్వార్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇంటర్వ్యూలకు ఆళ్వార్స్ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాల గాజువాక, గోపాలపట్నం బ్యాంచ్‌లకు చెందిన విద్యార్థులతో పాటు, ఇతర కళాశాలలకు చెందిన వారితో కలిపి 650 మంది వరకు హాజరయ్యారు. వీరిలో 293 మంది ఉద్యోగాలకు ఎంపికవ్వగా, ఇందులో 102 మంది ఆళ్వార్స్ విద్యార్థులు ఉన్నట్టు రాయల్ ఇన్‌ఫీల్డ్ హెచ్‌ఆర్ నాతియా ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాలల గ్రూప్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌వీహెచ్ రాజేంద్ర, ఈడీ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్, గోపాలపట్నం క్యాంపస్ కో-ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్, ప్రిన్సిపాళ్లు గోపి, సీహెచ్ రాజు, ఇతర విభాగాదిపతులు అభినందించారు.

‘కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యమే జీతాలు చెల్లించాలి’

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులకు కొంతమంది కాంట్రాక్టర్లు సరిగ్గా జీతాలు చెల్లించడం లేదని, ఆయా కార్మికులకు యాజమాన్యమే జీతాలు చెల్లించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ప్లాంటులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కొంతమంది కాంట్రాక్టర్లు పీఎఫ్, ఈఎస్ఐ సరిగ్గా చెల్లించడం లేదన్నారు. అటువంటి కాంట్రాక్టర్లపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సింహాద్రి, నరేంద్ర, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కాటాలను స్వాధీనం చేసుకున్న తూనికలు, కొలతలశాఖ అధికారులు

గోపాలపట్నం చేపల బజారులో తనిఖీలు

8 మందిపై కేసులు నమోదు చేసిన తూనికలు, కొలతలశాఖ అధికారులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బంక్ కూడలిలోని చేపల బజారులో తూనికలు, కొలతలశాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. బజారులోని చేపలు విక్రయించే వర్తకులు వినియోగిస్తున్న కాటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది వర్తకులు ఎలక్ట్రానిక్ కాటాలకు సవరణలు చేసి తూనికల్లో మోసాలకు పాల్పడుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో ఆ మంది చేపల విక్రయదారులపై కేసులు నమోదు చేసి కాటాలను స్వాధీనం చేసుకున్నారు. తూనికల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎస్ఎం రాధాకృష్ణ, ఎస్.ఉమాసుందరి, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు కిలోల లిక్విడ్ గంజాయి పట్టివేత

పెందుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతం నుంచి నగరంలోకి రవాణా చేస్తున్న లిక్విడ్ గంజాయిని పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు మహిళతో పాటు ఓ వ్యక్తిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మాడుగుల ఏజెన్సీ నుంచి గంజాయి రవాణా చేస్తున్నారన్న ముందస్తు సమాచారంతో వేపగుంట వద్ద పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో జి.మాడుగులకు చెందిన కొర్రా లక్ష్మి (36), అన్నవరానికి చెందిన శోభాకృష్ణ (40) అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా లిక్విడ్ గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.ఐదు లక్షలు ఉంటుందని సీఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామన్నారు.

ఐలా కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం

ఆటోనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఐలా కార్యాలయంలో మంగళవారం రైజ్ ఆస్పత్రి సౌజన్యంతో పారిశ్రామికవేత్తలకు, వివిధ కర్మాగారాలలో పని చేస్తున్న కార్మికులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఐలా కమిషనర్ ఎ.కిశోర్, చైర్మన్ సత్యనారాయణరెడ్డి (రఘు)లు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత వ్యాధులు, యూరిక్ యాసిడ్ టెస్టు, బోన్ డెన్సిటీ టెస్టు, ఈసీజీ, వంటి వాటితో పాటు దంత, నేత్ర, చెవి, ముక్కు పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి వైద్యులు మందులు అందజేశారు. కార్యక్రమంలో ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, ప్రతినిధులు పద్మావతి, సీహెచ్ సత్యనారాయణ, రామకృష్ణంరాజు, వై.సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, ఏకే బాలాజీ, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవడంతో పాటు వాటి సాధనకు అహర్నిశలు శ్రమించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం, ఉపాధ్యాయులు కుమారస్వామి, రవిచంద్, మహ్మద్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో ముగిసిన ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఎంఎస్ఎంఈ-డీఎఫ్‌వో క్యాంపస్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ఎస్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొనుగోలుదారులకు, విక్రేతలకు సరకు సరఫరా పెంచడంలో, ఎంఎస్ఎంఈలకు మార్కెటింగ్ మద్దతు అందించడంలో ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో వాసీవా సంయుక్త కార్యదర్శి ఈ.అనార్‌బాబు, హెచ్‌పీసీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గౌరీశంకర్, ఎంఎస్ఎంఈ జాయింట్ డైరెక్టర్ ఎంకే అంజనయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ ఫ్లోరిడాతో విజ్ఞాన్ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

అగనంపూడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలతో యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ ఫ్లోరిడా మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఈ మేరకు మంగళవారం విజ్ఞాన్ ప్రిన్సిపాల్ జె.సుధాకర్‌ను యూనివర్సిటీ బ్రాంచి మేనేజర్ హర్షప్రియ కలిసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అంతర్జాతీయ విద్యా అవకాశాలు, పరిశోధనలు, విద్యా మార్పిడి, పరిశ్రమలు, ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో అవగాహన ఒప్పదం కుదుర్చుకున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యనందించేందుకు అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ మధుసూదనరావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ఉషశ్రీ ప్రతిభ



సాధించిన కప్పులతో కార్పొరేటర్ ఉషశ్రీ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీకి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్, వుమెన్స్ డబుల్స్‌లో ట్రిపుల్ క్రౌన్ లభించింది. విజయవాడ క్లబ్ మైదానంలో సోమవారం హోరాహోరీగా జరిగిన ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో విజయం సాధించి ట్రిపుల్ క్రౌన్ దక్కించుకున్నారు. వుమెన్స్ సింగిల్స్, మిక్స్ డబుల్స్, వుమెన్స్ డబుల్స్ మూడు విభాగాల్లోనూ ఉషశ్రీ అద్భుతమైన ఆట తీరు ప్రదర్శించారు. వుమెన్ సింగిల్స్ 50 ప్లస్‌లో విజయవాడకు చెందిన ఇంద్రాణిని ఓడించి టైటిల్ గెలుచుకున్నారు. మిక్స్‌డ్ డబుల్స్ 50ప్లస్‌లో బీవీఎస్‌కే లింగేశ్వరరావుతో కలిసి బరిలోకి దిగిన ఉషశ్రీ విజయం సాధించారు. వుమెన్స్ డబుల్స్‌లో విజయవాడకు చెందిన పద్మతో జతకట్టి, టైటిల్ గెలుచుకోవడం విశేషం.

పోలీసుస్టేషన్‌లో ఇంటర్ ప్రశ్న పత్రాలు


పోలీసుస్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్న పత్రాలు

సీతంపేట, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను నాలుగో పట్టణ, ద్వారకా పోలీసు స్టేషన్లలో భద్ర పరిచారు. ఈ పరిధిలోని కళాశాలల అధ్యాపకులు పెట్టెలో పెట్టి స్టేషన్‌లో భద్రపరిచారు. పోలీసుల సమక్షంలో సీల్ వేశారు. పరీక్ష జరిగే రోజుల్లో గంట ముందుగా స్టేషన్ నుంచి వాటిని కళాశాలలకు తరలిస్తారు.

వైద్యులు లేని ఆరోగ్యకేంద్రం



జ్ఞానాపురంలో ఆరోగ్యకేంద్రం

జ్ఞానాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జ్ఞానాపురం పట్టణ ఆరోగ్యకేంద్రంలో పది రోజులుగా డాక్టరు లేరు. సరైన వైద్యం అందక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన వారి ఆరోగ్య సమస్యను తెలుసుకుని సిబ్బంది మందులు ఇచ్చి పంపిస్తున్నారు. ఇక్కడి డాక్టరు సెలవుపై వెళ్లిపోయారు. అధికారులు మరో డాక్టరును నియమించడం లేదా డిప్యుటేషన్‌పై పంపకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

కాశికా ప్రకాశిక పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాణిక్యాలరావు

సీతంపేట, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): భారతీభూషణ రాంభట్ల నృసింహశర్మ విరచిత కాశికా ప్రకాశిక (గాంగేయ తారావళి) పాటల పుస్తకాన్ని మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గాదె మాణిక్యాలరావు ఆవిష్కరించారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య బేతవోలు రామబ్రహ్మం పుస్తకాన్ని సమీక్షించారు. రాంభట్ల నృసింహశర్మ గేయ రచనా విధానాన్ని ప్రశంసించారు. రచయిత, విశ్లేషకుడు డాక్టర్ డీవీ సూర్యారావు ఆశీర్వాదం ఇచ్చారు. గోపిసంబాళ్ల శేషాచార్యులు అనుగ్రహ భాషణం పలికారు. డాక్టర్ రామవరపు మాధురీదేవి, టేకుపల్లి శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయునికి అర్చనలు

మాధవధార, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సూర్యానగర్‌లోని యోగసిద్ధాంజనేయ స్వామికి మంగళవారం సింధూర అర్చనలు చేశారు. భక్తులతో సామూహిక సుందరకాండ పారాయణం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో అర్చకులు పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు పెన్మత్స సుబ్బరాజు, ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

మాధవధార, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన జ్ఞానజ్యోతి అంగన్‌వాడీ శిక్షణ మంగళవారంతో ముగిసింది. మాధవధార హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలకు సీడీపీవో శారద ధ్రువపత్రాల్ని అందించారు.


మంగళవారం వ్యాపారాలు చేసుకుంటున్న దృశ్యం


అక్కయ్యపాలెం బస్టాపు వెనుక గ్రీన్‌బెల్టులో తొలగించని దుకాణాలు

తూతూమంత్రంగా దుకాణాల తొలగింపు

» అంతుపట్టని అధికారుల తీరు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన దుకాణాల తొలగింపులో పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు అంతుపట్టడం లేదు. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా వ్యవహరిస్తున్నారు. పోర్టు స్టేడియం సమీపాన అక్కయ్యపాలెం బస్టాపు వెనుక గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలను సోమవారం తొలగించారు. నామమాత్రంగా మూడు నాలుగు దుకాణాలు తొలగించి మిగిలినవి వదిలేశారు. అక్కడ ఇంటర్మీడియట్ ప్రైవేటు కాలేజీ ఎదురుగా ఉన్నవి మాత్రమే తీసి ఈ చివరి రోడ్డు వరకు ఉన్నవి ఉంచేశారు. అక్కడ యథాప్రకారం చికెన్, మటన్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు నడుపుతున్నారు. దీనిపై స్థానికులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. నెలనెలా మామూళ్లు ఇచ్చేవారిని టౌన్ ప్లానింగ్ సిబ్బంది వదిలేశారని ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా అలాగే వ్యవహరిస్తున్నారని, ఆ రోడ్డుకు పక్కనే పాడుబడిన వాహనాలను పార్కింగ్ చేసి వదిలేసినా పట్టించుకోవడం లేదని, వాహనాలు, దుకాణాలతో రోడ్డు నిండిపోతున్నదని, శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

టెండర్ వేసేందుకు వస్తే తరిమికొడతాం

» సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ


నిరసన దీక్ష చేస్తున్న కార్మికులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆస్పత్రి దక్కించుకునేందుకు టెండర్ వేయడానికి వచ్చేవారిని అడ్డుకొని తరిమికొట్టాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించవద్దంటూ చేస్తున్న నిరసన దీక్ష మంగళవారినికి 147వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, ఆస్పత్రి అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించాలనే ఆలోచన దుర్మార్గమన్నారు. విశాఖ పోర్టు అభివృద్ధికి ఆస్పత్రి కీలకమని, ఏటా కార్పొరేషన్‌కు రూ.65 కోట్ల పన్ను చెల్లిస్తున్న పోర్టును ప్రైవేటుకు ధారదాత్తం చేయడం అభివృద్ధికి అడ్డుగా నిలపడమేనన్నారు. వాయిదాలు వేయడం కాకుండా టెండర్లు పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జె.సత్యనారాయణ, డి.ఈశ్వరరావు, నాయుడు, రాజగోపాల్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు

1న క్యాన్సర్ వ్యాక్సినేషన్ శిబిరం

మహారాణిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాపిస్తున్న నేపథ్యంలో నివారణకు మార్చి 1న పాత పోస్టాఫీస్ వద్ద క్వీన్‌మేరీ బాలికల పాఠశాల వద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు లయన్ డాక్టర్ శిరిన్ రహమాన్ తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్‌ను నియంత్రించడంలో విశాఖపట్నం పోర్టు ట్రస్టు సమకూర్చిన సీఎస్ఆర్ నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. లయన్ ఇంటర్నేషనల్ వైజాగ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి పోర్టు ట్రస్టు చైర్మన్ అంగముత్తు, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

యూనియన్ బ్యాంక్‌లో పేమెంట్ గేట్ వే సేవలు



పోస్టర్ విష్కరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సీతమ్మధార, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ పై కామర్స్ అనే పేమెంట్ టెక్నాలజీతో ఈ పేమెంట్ గేట్ వే ద్వారా సేవలను అందిస్తున్నట్టు బ్యాంక్ జోనల్ హెడ్ షాలినీ మీనన్ తెలిపారు. సీతమ్మధార ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో పేమెంట్ గేట్ వే పోస్టర్‌ను సీఎండీ పృథ్వీరాజ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షాలినీ మీనన్ మాట్లాడుతూ పేమెంట్ గేట్ వే ద్వారా లక్షలాది విద్యుత్ వినియోగదారులు సులభంగా బిల్లులను చెల్లించవచ్చన్నారు. ఇది ప్రస్తుతం ఆన్‌లైన్ వెబ్ పోర్టర్ ద్వారా అందుబాటులోకి తెచ్చామని, త్వరలో మొబైల్ యాప్ ద్వారా సేవలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ అధికారులు, ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం, సీజీఎం పి.వెంకటేశ్వరరావు, ఐటీ సీజీఎం పి.శ్రీనివాసరావు, ఫైనాన్స్ జీఎం కె.అరుణ, ఎలికే సుధాకరరావు, ఏజీఎం అబ్దుల్ అలీమ్ పాల్గొన్నారు.

అధికారిక దత్తతను ప్రోత్సహిద్దాం

» బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం


దత్తత తీసుకున్నవారికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న సీతారాం

మర్రిపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందించిన కారా చట్టం నిబంధనలను అనుసరించి అధికారిక దత్తతను ప్రోత్సహించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. మంగళవారం మర్రిపాలెంలోని శిశుగృహలో మూడేళ్ల ఆడపిల్లను తమిళనాడులోని చెన్నైకి చెందిన డి.మోహన్‌రాజ్, ఎస్.సత్య దంపతులకు అధికారికంగా అప్పగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారిక దత్తత వలన భవిష్యత్ సురక్షితమని, అనధికారిక దత్తత అనర్థాలకు దారితీసే అవకాశముంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతస్థాయిలో ప్రచారాన్ని చేపట్టవలసిన ఆవశ్యకతపై రాష్ట్ర కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు. పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు సొంత బిడ్డలకంటే ఎక్కువ ఆదరాభిమానాలతో పెంచి పోషించి వారిని అన్నివిధాలుగా ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షురాలు ఎం.ఆర్.ఎల్.రాధ, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారిణి రమణకుమారి, బాలల సంరక్షణ విభాగం పీఓఎస్ఐసీ మమత, శిశుగృహ మేనేజర్ సుజాత, సోషల్‌వర్కర్ రామలక్ష్మి, సభ్యులు మండ రజిని, విజయలక్ష్మి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా విద్యుత్ లైన్ల మరమ్మతులు

కంచరపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి. వెలగని దీపాలను మార్చి, అవసరమైన చోట స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు పర్యవేక్షిస్తున్నారు. మర్రిపాలెం సబ్ స్టేషన్ ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆర్టీసీ ఎండీ


ద్వారకా బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మంగళవారం ద్వారకాబస్‌స్టేషన్‌ను సందర్శించారు. కొత్తగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రయాణికుల సమస్యలను తెలుసుకున్నారు. బస్‌స్టేషన్ ఆవరణను, బస్సులను పరిశీలించారు. బస్‌స్టేషన్ పరిశుభ్రత, బస్సుల నిర్వహణ, సమయపాలన, తాగునీటి సౌకర్యం తెలుసుకున్నారు. అనంతరం స్టాల్స్ పరిశీలించి నాణ్యమైన వస్తువులను ఎంఆర్‌పీకే అమ్మాలని నిర్వాహకులకు ఆదేశించారు. విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్, విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు, ఇంజినీరింగ్ అధికారులున్నారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌ను సందర్శించారు.

ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తే వారినే గెలిపించాలి

» పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ గౌరి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తేవారిని గెలిపించాలని పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి కోరారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతున్న పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్నానన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవో కారణంగా అనేక పాఠశాలలు మూతపడ్డాయన్నారు. దీన్ని రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు, మాట నిలబెట్టుకోలేదన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు కలుషితం చేశాయన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలమ్మ అమ్మవారి తొలేళ్లు


అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

అల్లిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం తొలేళ్లతో ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రత్యేక కుంకుమ పూజలు, ఉదకాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం భక్తులు పల్లకీ సేవ, అగ్నిగుండం మహోత్సవం నిర్వహించారు. ఈవో రమాబాయి, కార్పొరేటర్లు బీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీకాకుళం రోడ్డు వరకే...పలాస పాసింజర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల దృష్ట్యా విశాఖ, పలాస మధ్య పాసింజర్ రైళ్లను శ్రీకాకుళం రోడ్డు వరకు గమ్యాన్ని కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. మార్చి రెండో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందన్నారు.

మార్కెటింగ్ మాయ!

... 5వ పేజీ తరువాయి

అమ్మడం ఏమిటని ప్రశ్నించారు. అందుకు ఆ ఎస్టేట్ అధికారులు...అంత దూరం నుంచి తెప్పించినందున రవాణా చార్జీలు అవుతాయని, అందుకే రేటు ఎక్కువ పెట్టినట్టు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే స్థానికంగా దిగుమతి అవుతున్న టమాటాను తీసుకోకుండా దూరం నుంచి తెప్పించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విశాఖ, అనకాపల్లి జిల్లాల జాయింట్ కలెక్టర్లు దృష్టిసారించాలని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అతిథులుగా హాజరై మాట్లాడారు. పరమ శివుని సేవాభావంతో స్మరించుకుంటే సంపూర్ణంగా ప్రతి ఒక్కరికీ విజయాలు చేకూరుతాయన్నారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మకుమారీల ప్రతినిధి బీకే రామేశ్వరి, గంట్ల శ్రీనుబాబు, ఆర్.నాగరాజు పట్నాయక్, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్య, వినయమే యువత భవిష్యత్తుకు పునాది

సీతంపేట, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): విద్య, వినయమే యువత భవిష్యత్తుకు పునాదులని ఏయూ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ జి.నానాజీ అన్నారు. బీవీకే కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నానాజీ హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ ఎం.పట్టాభిరామారావు మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడంలో బీవీకే కళాశాల ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కార్యదర్శి వి.రామసత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ పూసపాటి వెంకటపతిరాజు, ప్రిన్సిపాల్ పి.రత్నశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలపై చర్చలు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ, ఇంతవరకూ శాంతియుతంగా పోరాటం చేశామని, దీనిని యాజమాన్యం అసమర్థతగా భావిస్తోందన్నారు. మార్చి 7వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టంచేశారు. ఈ విషయంలో కార్మికులు అందరినీ కలుపుకొని వెళతామని అయోధ్యరామ్ వెల్లడించారు.

ఆర్‌బీఐ మాజీ గవర్నర్‌కు కలెక్టర్ ఆత్మీయ స్వాగతం


సుబ్బారావుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

మహారాణిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరపు సుబ్బారావుకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మంగళవారం ఆత్మీయ స్వాగతం పలికారు. ఆంధ్ర విశ్వవిద్యాల యం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలుసుకుని, పలు అంశాలపై చర్చించారు.

రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ డీఆర్ఎం లలిత్ బొహ్రా మంగళవారం రాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. బాధ్యతలు చేపట్టిన రెండో రోజు స్టేషన్‌లో పర్యటించి పారిశుధ్యం, పరిశుభ్రత తోపాటు ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, రద్దీ సమయంలో చేపడుతున్న భద్రతా చర్యలను పరిశీలించారు. ప్లాట్‌ఫామ్‌లపై ఏర్పాటు చేసిన ఎస్కలేటర్లు, లిఫ్టులు ఎలా పనిచేస్తున్నాయో తనిఖీ చేశారు. క్యాటరింగ్ స్టాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, జనరల్ టికెట్ బుకింగ్ కార్యాలయం, స్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాను పరిశీలించారు. అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్... మహా టెన్షన్

... 5వ పేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. అధికారుల తనిఖీలు లేకపోవడంతో కింది స్థాయి సిబ్బందిలో నిర్లక్ష్యం చోటుచేసుకుంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు పూర్తిగా మరుగునపడిపోయింది. గతంలో దుకాణాలు, హోటళ్లు వంటి కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ల వద్ద చెత్త కనిపిస్తే బాధ్యులైన వ్యాపారులకు జరిమానాలు, విధించడం, కేసులు నమోదుచేయడం చేసేవారు. ఇప్పుడు అటువంటి చర్యలు లేకపోవడంతో దుకాణాల పక్కన మళ్లీ చెత్త దర్శనమిస్తోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుపై ప్రభావం

స్వచ్ఛ సర్వేక్షణ్-2024 సర్వే గత ఏడాది జరగాల్సి ఉంది. అయితే సాధారణ ఎన్నికల కారణంగా జరగలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కేంద్ర బృందాలు వివిధ నగరాల్లో పర్యటించి సర్వే చేస్తున్నాయి. అందులో భాగంగా విశాఖకు మార్చి మొదటి వారంలో కేంద్ర బృందాలు వచ్చే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ 2015లో 237, 2016లో ఐదు, 2017లో మూడు, 2018లో ఏడు, 2019లో 23, 2020, 2021లో తొమ్మిది, 2022, 2023 పోటీల్లో నాలుగో ర్యాంకు దక్కించుకుంది. ఈ ఏడాది ర్యాంకు మరింత మెరుగుపడుతుందని భావించినప్పటికీ గత 45 రోజులుగా పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో నగరంలో పారిశుధ్యం దిగజారిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ప్లాస్టిక్ నియంత్రణ, గెడ్డల సుందరీకరణ వంటి అంశాల్లో కూడా వెనుకబాటుతనం కనిపిస్తోంది. ఇటువంటి తరుణంలో కేంద్ర బృందాలు నగరానికి వస్తే ఆయా అంశాలను పరిశీలించి తక్కువ మార్కులు వేసే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులే అంటున్నారు.

అర్ధరాత్రి హత్య

... 5వ పేజీ తరువాయి

తీసుకువెళ్లారు. అక్కడ వైద్యుడికి చూపించిన తర్వాత తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. ఆ సమయంలో మద్యం తాగడానికి కుటుంబ సభ్యులను ఆనందరావు డబ్బులు అడగ్గా, ఇవ్వకపోవడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 11 గంటల సమయంలో వెంకోజీపాలెం జంక్షన్‌లో హనుమాన్ విగ్రహం వద్ద ఉన్న నూడిల్స్ దుకాణం పక్కన ఫుట్‌పాత్‌పై ఆనందరావు కూర్చుని ఉన్నాడు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం చనమల్లుపేటకు చెందిన చనమల్లు శ్రీనివాసరావు (24) రాత్రి 12 గంటల సమయంలో ఆనందరావు కూర్చున్న సమీపంలోని నూడిల్స్ దుకాణం వద్దకు వచ్చాడు. శ్రీనివాసరావు గతంలో సీతమ్మధారలోని రాజుస్ కిచెన్‌లో తందూరీ మాస్టర్‌గా పని చేసి, ప్రస్తుతం పీఎం పాలెంలో కొత్తగా ప్రారంభించిన రాజూస్ కిచెన్ బ్రాంచిలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 10.30 గంటలకు పీఎం పాలెంలో పని ముగించుకున్న శ్రీనివాసరావు సీతమ్మధారలోని స్నేహితులను కలిసేందుకు బైక్‌పై వచ్చాడు. స్నేహితుడితో కలిసి వెంకోజీపాలెంలోని ఒక బార్‌లో మద్యం సేవించాడు. అక్కడి నుంచి తనకు పరిచయస్తుడైన నూడిల్స్ షాప్ నిర్వాహకుడి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న శ్రీనివాసరావు నూడిల్స్ దుకాణం పక్కన కూర్చుని ఉన్న ఆనందరావు వద్ద గట్టిగా అరిచాడు. దీంతో ఆనందరావు ఎందుకలా అరుస్తున్నావంటూ? ఆగ్రహం వ్యక్తంచేశాడు. ఆ సమయంలో ఇద్దరూ ఒకరినొకరు తోసుకోవడంతో మద్యం మత్తులో ఉన్న శ్రీనివాసరావు కిందపడిపోయాడు. అనంతరం లేచి ఆనందరావును కొట్టడంతో శ్రీనివాసరావును నూడిల్స్ దుకాణం నిర్వాహకుడు అడ్డుకున్నాడు. కొంతసేపు ఆగిన తర్వాత శ్రీనివాసరావు విచక్షణ కోల్పోయి ఒక్కసారిగా పక్కనే ఉన్న బండరాయిని తీసి ఆనందరావు తలపై మోదాడు. దీంతో ఆనందరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హత్యచేసిన శ్రీనివాసరావు అక్కడి నుంచి భయంతో బైక్‌పై పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో తాను ఉంటున్న రూమ్‌కు వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం పారిశుధ్య నిర్వహణ సిబ్బంది నూడిల్స్ దుకాణం వద్ద ఉన్న ఆనందరావు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎవరో బండరాయితో మోది హత్య చేసినట్టు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఎంవీపీ కాలనీ స్టేషన్ సీఐ జె.మురళీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ప్యాంటు జేబులో ఆధార్ కార్డు లభించడంతో అందులోని చిరునామా ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నూడిల్స్ దుకాణం నిర్వాహకుడిని దీనిపై ప్రశ్నించగా మొదట తనకేమీ తెలియదని బుకాయించినప్పటికీ పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో శ్రీనివాసరావు హత్య చేసినట్టు వివరించాడు. నూడిల్స్ దుకాణం నిర్వాహకుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ మురళీ తెలిపారు.

ఏయూకు ఎందుకంత నిర్లక్ష్యం!?

... 5వ పేజీ తరువాయి

సిద్ధం కాకపోవడమేనని తెలుస్తోంది. ల్యాబ్‌కు తగిన వసతులు ఏర్పాటు చేసేందుకు సుమారు కోటి రూపాయలు ఖర్చవు తుంది. నిధులు ఉన్నప్పటికీ గత వీసీ ప్రసాద రెడ్డితోపాటు ఆ తరువాత వచ్చిన అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఇదిలావుండగా పరికరాలు కొనుగోలు చేసిన సంస్థకు ఇప్పటివరకూ కోటిన్నర మాత్రమే చెల్లించారు. మిగిలిన సొమ్ము బకాయి పెట్టడంతో సదరు సంస్థ కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్టు చెబుతున్నారు. మిగిలిన రూ.3.5 కోట్లు వర్సిటీ వద్ద ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ...వారంటీ గడువు ముగిసినందున ఏదైనా సమస్య వస్తే ఎవరి మెడకు చుట్టుకుంటుందోననే ఆందోళన వ్యక్తమవు తోంది.

నిర్లక్ష్యమే కారణం..

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) అనుమతి లేదన్న కారణంతోనే ఈ ల్యాబ్ పనులను ప్రారంభించలేదని అధికారులు చెబుతున్నట్టు తెలుస్తోంది. అసలు ప్రతిపాదనను ఈసీలో పెట్టలేదని భోగట్టా. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మొదటి విడత ఇచ్చిన ఐదు కోట్ల రూపాయలను సద్వినియోగం చేసుకుని ఉంటే మరో రూ.5 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. కానీ, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. ఇదిలావుంటే ప్రారంభం కాని ల్యాబ్‌కు వర్సిటీ అధికారులు ఓ అధికారిని నియమించారు. ఫార్మసీ కాలేజీకి చెందిన ఒక సీనియర్ ప్రొఫెసర్‌ను ఎలిమెంట్‌కు కో-ఆర్డినేటర్‌గా నియమించి, నెలకు రూ.75 వేలకుపైగా వేతనాన్ని చెల్లిస్తూ వచ్చారు.

ఇంజనీరింగ్ కాలేజీలో అదే తంతు..

ఇంజనీరింగ్ కాలేజీ పరిధిలో కూడా సీ4ఐ4 ల్యాబ్‌ను ఏర్పాటుచేయాలని అధికారులు భావించారు. ఈ ల్యాబ్‌లో ఏర్పాటుచేసేందుకు సుమారు రూ.4 కోట్లు విలువజేసే పరికరాలను కేంద్రం కొన్నాళ్ల కిందట చేసి పంపించింది. అయితే, ల్యాబ్‌ను సిద్ధం చేయడంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో ఆ పరికరాలను కేంద్రం మళ్లీ వెనక్కి తీసుకుంది.

టీడీఆర్ హబ్ ప్రవేశాలపై గందరగోళం

... 5వ పేజీ తరువాయి

సన్నిహితుడొకరు కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన ఉన్నత విద్యా శాఖ నివేదిక వచ్చిన తరువాతే తదుపరి నిర్ణయం తీసుకోవాల్సింది. కానీ అందుకు విరుద్ధంగా ఆదేశాలు ఇవ్వడంపై ప్రొఫెసర్లు ఆశ్చర్యపోతున్నారు. భిన్నమైన ఆదేశాలతో వర్సిటీ అధికారులతోపాటు ప్రవేశాలు పొందిన అభ్యర్థులు, ఆయా విభాగాధిపతులు అయోమయానికి గురవుతున్నారు.

విభాగాలకు కేటాయించే అవకాశం

ఉన్నత విద్యా శాఖ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఏపీఆర్‌సెట్ ద్వారా ప్రవేశాలు పొందిన 685 మందికి తదుపరి దశను ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వీరందరినీ ఆయా విభాగాలకు కేటాయించనున్నారుగైడ్ల అర్హతను పరిశీలించి అర్హులైతే కొనసాగించనున్నారు. అనర్హులు ఉంటే వారిని తొలగించి విభాగాధిపతి ఆధ్వర్యంలో కొత్త గైడ్లను కేటాయిస్తారు. అనంతరం ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు, వైవా నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు చెబుతున్నారు. ఆర్‌సెట్ ద్వారా ప్రవేశాలు పొందని వారి విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. కొత్త వీసీ బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఉన్నత విద్యా శాఖ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు వెల్లడించారు.

నేడు మహా కుంభాభిషేకం

... 5వ పేజీ తరువాయి

కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు అత్యంత వైభవంగా అభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు స్వయంగా అభిషేకాలు చేయవచ్చన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు శివపార్వతుల కల్యాణం, హోమం జరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు బ్రహ్మానందం, అవధాని మాడుగుల నాగఫణిశర్మ, తదితరులు విచ్చేస్తారని సుబ్బిరామిరెడ్డి పేర్కొన్నారు.

పార్కులో లైట్ల ఏర్పాటు



కొత్త లైట్ల ఏర్పాటుతో ధగధగలాడుతున్న పార్కు పరిసరాలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులో మంగళవారంకొత్త ఐమాస్ట్ లైట్లను వేశారు. స్థానికులు, క్రీడాకారుల ఫిర్యాదుతో విద్యుత్ లైన్‌మన్ శ్రీను చొరవ తీసుకని పార్కులోని పని చేయని నాలుగు లైట్లస్థానలో కొత్తవి వేసేలా చర్యలుతీసుకున్నారు. దీంతో చాల రోజులుగా సాయంత్ర కాగానే చీకటిమయంగా ఉండే ఈ ప్రాంతం మంగళవారం ధరధగ మెరిసింది. కొత్త లైట్ల ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మూడు కిలోల లిక్విడ్ గంజాయి పట్టివేత

పెందుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతం నుంచి నగరంలోకి రవాణా చేస్తున్న లిక్విడ్ గంజాయిని పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు మహిళతో పాటు ఓ వ్యక్తిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మాడుగుల ఏజెన్సీ నుంచి గంజాయి రవాణా చేస్తున్నారన్న ముందస్తు సమచారంతో వేపగుంట వద్ద పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో జి.మాడుగులకు చెందిన కొర్రా లక్ష్మి (36), అన్నవరానికి చెందిన శోభాకష్ణ (40) అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా లిక్విడ్ గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.ఐదు లక్షలు ఉంటుందని సీఐ పేర్కొన్నారు. కేసునమోదుచేసి నిందితులను అరెస్టుచేశామన్నారు.

సత్యసాయి ప్రేమ్‌సదన్‌లో నేడు ప్రత్యేక కార్యక్రమాలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి సందర్భంగా స్థానిక శ్రీ సత్యసాయి ప్రేమ్ సదన్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలునిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సామూహిక వివిధ ఫలరసామృత అష్టోత్తర శత కలశ ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన,దుద్రహోమం, పూర్ణాహుతి వేద బృందం సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటల నుంచి పార్వతీ పరమేశ్వరుల కళ్యాణజ నిర్వహిస్తారు.

సినిమా గైడ్

- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
- **తండేల్ :** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20,వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 36, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	480
విజయనగరం	484
శ్రీకాకుళం	484

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	68
లైవ్ ధర	88
విత్ స్కిన్	146
స్కిన్‌లెస్	156

శివరాత్రి పూజలకు ఆలయాలు సిద్ధం

- వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- సాయంత్రం వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమలు
- బాలా త్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామ ఆలయంలో అర్ధరాత్రి లంగోద్భవ కార్యక్రమం



విద్యుద్దీపాల ధగధగలతో బాలా త్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయం

ఆరిలోవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు శివాలయాలను సిద్ధం చేస్తున్నారు. ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలో వెలిసిన బాలాత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ చుట్టూ సర్వాంగసుందంగా రంగురంగుల బల్బులతో విద్యుదీకరణ చేపట్టారు. శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం వేకువ జామున స్వామికి తొలిపూజ నిర్వహిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు, ట్రస్టీ కృష్ణంరాజు తెలిపారు.

శివుడికి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వివిధ పవిత్ర జలాలతో ప్రత్యేక అభిషేకాలు, పంచామృత అభిషేకాలు చేపట్టనున్నట్టు చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు , భక్తి రంజనీ, విఘ్నేశ్వర గ్రూపు వారిచే నిర్వహించనున్నట్టు తెలిపారు అలాగే పెదగదిలి విజయ బృందంతో కోలాటం ప్రదర్శన ఉంటుదన్నారు. రాత్రి పది గంటల నుంచి మహాన్యాస రుద్రాభిషేకాలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమం అనంతరం స్వామికి రుద్రాభిషేకాలు చేపట్టనున్నట్టు తెలపారు. అదిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

సకాలంలో ధ్రువపత్రాలు జారీచేయాలి

జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.వెంకటశేషమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ వెంకటశేషమ్మ, జీవీఎంసీ అధికారులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందించే జనన, మరణ, కుల, వివాహ, ఆదాయ ధ్రువపత్రాలను ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు నిర్దిత సమయంలో జారీ చేయలని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె సూర్యా బాగ్‌లోని జీవీఎంసీ నాలుగో జోన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజలకు అందించే జనన, మరణ, కుల, వివాహ, ఆదాయ ధ్రువపత్రాలను జారీ ప్రక్రియ విషయమై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎస్వీ నరేష్‌కుమార్, జిల్లా రిజిస్టర్ ఉపేంద్రతో కలిసి సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనన, మరణ, కుల, వివాహ, ఆదాయ వంటి ధ్రువపత్రాలు జారీ చేయడంలో అలసత్వం ప్రదర్శించకుండా, ఆలస్యం చేయకుండా సకాలంలో అందించాలన్నారు. జనన, మరణ సర్టిఫికెట్లు నమోదు, జారీ చేసే విషయంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యంతో 6 నెలలకు ఒకసారి సైన్సిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సర్టిఫికెట్ల జారీ విషయంలో ప్రభుత్వ జీవోలను క్షుణ్ణంగా పరిశీలించి తగు జాగ్రత్తలు పాటించాలన సూచించారు. అన్ని శాఖల అధికారులు ధ్రువపత్రాల ప్రక్రియ చేపట్టాలన్నారు.

వివాహ ధ్రువపత్రాలు జారీ చేసేటప్పుడు వధూవరుల వయసు పరిగణనలోకి తీసుకోవాలని, వయస్సులను నిర్ధారణ కోసం వారి ఆధార్ కార్డులతో పాటు 10వ తరగతి, స్కూల్ లీవింగ్, మున్సిపల్ జనన ధ్రవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి మ్యారేజ్ రిజిస్ట్రేషన్లను జరిపి ధృవ పత్రాలను జారీ చేయాలని సూచించారు. వార్డు సచివాలయాల్లో ఈ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేటప్పుడు సంబంధిత జీవోలను సంబంధిత వార్డు కార్యదర్శులు క్షుణ్ణంగా పరిశీలించి వాటి ఆధారంగా ఆయా ధ్రువ పత్రాలను జారీ చేయాలని సూచించారు. ధ్రువ పత్రాల జారీలో ఎటువంటి తప్పులు జరగకూడదని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జిల్లా రిజిస్టర్ ఉపేంద్రను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో1, 2, 3, 7 జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవోడబ్ల్యు నేతలు

8న ఒంగోలులో పీవోడబ్ల్యు విలీన సభ

సిరిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పీవోడబ్ల్యుగా పనిచేసిన సంస్థలు ఆంధ్ర రాష్ట్ర పరిధిలో ఒకటి కావడానికి మార్చి 8న ఒంగోలులో రాష్ట్రస్థాయి విలీన సభను నిర్వహిస్తున్నట్టు పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీ తెలిపారు.మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్రస్థాయి విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి8న విశాఖలోని పౌరగ్రంథలయంలో నిర్వహిస్తున్నామన్నారు.హక్కులు పోరాటాల ద్వారానే సంక్రమిస్తాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎస్ రోహిణి దేవి , బాలనాగమ్మ, ఈసర లక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండుగ



పండుగను నిర్వహిస్తున్న రజకులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు రజకవీధిలో రజక సేవా సమైక్య సంఘం ఆధ్వర్యంలో బల్లల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. రజకుల సంప్రదాయ పండుగలో ప్రతీ ఏడాది బల్లల పండుగను నిర్వహిస్తుంటారు. రజకులు తాము వినియోగించే బండరాళ్లకు పూజలు నిర్వహించి, తాము భక్తితో కొలిచే వృత్తిని గౌరవించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ తూర్పు పరిశీలకులు మొల్లి అప్పారావు, సంఘం అధ్యక్షుడు మడక ఈశ్వరరావు, సభ్యులు చొల్లంగి నాగేశ్వరరావు, కార్యదర్శి మడక ఈశ్వరరావు, క్యాషియర్ వేములవలస శ్రీను, ఉపాధ్యక్షులు బవిరి అప్పలరాజు, సహాయ కార్యదర్శి వేములవలస అప్పలరాజు, సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు శివుడికి అభిషేకాలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ టౌన్ సర్వీస్ రిజర్వాయర్ టీఎస్ఆర్ (మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రాంగణం)లో ఉన్న శివ మందిరంలో మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 9 గంటల నుచించి పంచామృతాభిషేకం, బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు నాగేంద్ర తదితరులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర ఆహార ప్రయోగశాలను ప్రారంభించి నేటికి ఒక సంవత్సర గడిచిందని, అత్యంత దురదృష్టకరమైన విషయం ఏమిటంటే..ఈ ప్రయోగశాలలో నేటికీ ఒక్క పరీక్షకు కూడా చేపట్టలేదని బీజేపీ విశాఖ పార్లమెంట్ మాజీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన తరువాత ఆంధ్రాలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎఫ్ఎస్ఎస్ ఏఐ మూడు టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలియజేయడమే కాకుండా సహకారం కూడా అందించిందన్నారు. అయితే గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తూ నిర్దేశించిన సమయానికి టెస్టింగ్ ల్యాబ్స్ పూర్తి చేయకుండా అవకాశం ఉన్నా కూడా ఇక్కడ చేయవలసిన పరీక్షలను ప్రైవేటు లేబరేటరీలకు తరలిస్తూ కోట్లాది రూపాయల ప్రభుత్వధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే ఇక్కడ ప్రయోగశాల నిర్వహణ సక్రమంగా జరగకపోవడం వలన అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న విషయాన్ని అధికారులకు తెలియపరిచినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని, గత ప్రభుత్వం చేసిన గాయాల నుంచి మన రాష్ట్రం ఇంకా పూర్తిగా కోలుకోలేదన విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఒక్కొక్కటిగా చక్కబెట్టుకుంటూ వస్తోందన్నారు. విశాఖలో ఉన్న ప్రయోగశాలకు సంబంధించిన విషయాలను సమయానికి ప్రభుత్వానికి తెలియజేయడంలో అధికారులు విఫలమవుతున్నారని, దానివల్ల సమయానుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటుందని, ఇలాంటి సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు అంతకంటే ఎక్కువ పరిశోధనశాలలు ప్రారంభించడం కంటే, ఇప్పటికే ప్రధాని ప్రారంభించిన విశాఖ పరిశోధన శాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, అందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని నిపుణులను (సుమారు 80 నుండి 90 మంది) అందించాలని, మూలన పడి ఉన్న మొబైల్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను కూడా వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత సంవత్సరంలో జరిగిన ఎఫ్ఎస్ఎస్ఏఐ, రాష్ట్ర ఆరోగ్య ప్రయోగశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కేటాయించిన సుమారు రూ.80లో కొంత భాగాన్ని విశాఖ పరిశోధన శాలకు కేటాయించి త్వరితగతిన ఇక్కడి ప్రయోగశాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తద్వారా ఆహార పరిశోధనలలో 28 స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో నిలపాలని కోరారు.లేకుంటే రోజురోజుకూ పెరిగిపోతున్న ఆహార కల్తీ బారిన పడి ప్రజలు క్యాన్సర్ వంటి రోగాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దోని నాగరాజు పాల్గొన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆర్టీసీ ఎండీ



ద్వారకాబస్‌స్టేషన్‌లో ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మంగళవారం ద్వారకాబస్‌స్టేషన్‌ను సందర్శించారు. కొత్తగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రయాణికుల సమస్యలను తెలుసుకున్నారు. బస్‌స్టేషన్ ఆవరణను, బస్సులను పరిశీలించారు. బస్‌స్టేషన్ పరిశుభ్రత, బస్సుల నిర్వహణ, సమయపాలన, తాగునీటి సౌకర్యం తెలుసుకున్నారు. అనంతరం స్టాల్స్ పరిశీలించి నాణ్యమైన వస్తువులను ఎంఆర్‌పీకే అమ్మాలని నిర్వాహకులకు ఆదేశించారు. విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్, విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు, ఇంజినీరింగ్ అధికారులున్నారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌ను సందర్శించారు.

శ్రీ అసంగానంద ఆశ్రమం నేడు మహాశివ రాత్రి వేడుకలు



శ్రీ అసంగానంద ఆశ్రమం

పెదవాల్తేరు పెదవాల్తేరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీఅసంగానంద ఆశ్రమం, శ్రీమృత్యుంజయశ్వరా ఆలయంలో నేడు ఘనంగా వేడుకలునిర్వహిస్తున్నట్లు ఆలయ ఉపాధ్యక్షులు ఎంవీ శ్రీనివాస రెడ్డి తెలిపారు. శ్రీవిష్ణుసేవనంద గిరి స్వామి పర్యవేక్షణలో ఆలయంలో ఉదయం నాలుగు గంటల నుంచి శివలింగానికి పంచామృతాలతో అభిషేకం, సాయంత్రం నాలుగు గంటలకు పురవీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం ఆరు గంటలకు గంగా, యమున, సరస్వతి, కష్ణా, గోదావరి నదీజలాలతో (పంచనదీ జలాలు) అభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోద్భావ సమయంలో క్షారాభిషేకం, రాత్రి ఒంటి గంటలకు రుద్రాభిషేకం ఉంటుందన్నారు. సాయింత్రం ఐదు గంటల నుంచి 12 గంటల వరకు నాట్యపరిమల మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ లీపికా రెడ్డి, రాగమాలిక సాంస్కృతిక సేవా సంస్థ, కేవీ సత్యనారాయణ, మాస్టర్ ప్రసాద్ రావు అధ్వర్యంలో కీర్తనలు, భక్తి పాటలు, శివ సంకీరత్తనలు జరుగుతాయన్నారు. అభిషేకాలు స్వయంగా భక్తులే చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కాగితాల సత్యనారాయణ రెడ్డి, సిహెచ్ హనుమంతురావు, విశ్వేశ్వర రావు, చిన్న, నారాయణమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'హిత వచనాలు వినకుంటే వినాశనమే'

- ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : రావణాసురుడి వల్ల సీతమ్మ లోకమంతటికి ఎలా ప్రవర్తించాలో నేర్పించిందని ఎంతగొప్పవారు ఎన్ని మంచి మాటలు చెప్పినా వినే లక్షణం లేనప్పుడు రావణుడి వలే నాశనం తప్పదని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా సుందరకాండలోని సీతా, రావణుల సంవాద ఘట్టాన్ని వివరించారు.

బ్రహ్మముహూర్తంలో లేచినప్పటికీ రావణుడు దైవమునందు అనుష్ఠానం చేయకుండా సీతమ్మపై మాత్రమే దృష్టి కలిగి సీతమ్మ వద్దకు వచ్చి చుట్టూ స్త్రీలు, తన భార్య ఉన్నారన్న మర్యాద సైతం లేకుండా కామ మోహితుడై ఆమెను ప్రలోభపెట్టే మాటలు మాట్లాడిన తరువాత సీతమ్మ రావణుడికి గడ్డిపోచ అడ్డుపెట్టి హితబోధ చేసిన ఘట్టాన్ని వివరించారు.

ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్యసోమరాజు, అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లీడర్ పత్రిక సంపాదకుడిపై తదుపరి చర్యలు నిలుపుదల

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కథనాలు ప్రచురించి ఉద్దేశపూర్వకంగా అవమానించారని, ఈ వ్యవహారంలో తన ముందు హాజరై వివరణ ఇవ్వాలంటూ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ హోదాలో విశాఖ ఆర్డీవో శ్రీలేఖ ఈ నెల 13వ తేదీన ఇచ్చిన నోటీసు ఆధారంగా లీడర్ పత్రిక సంపాదకులు వీవీ రమణమూర్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.రాహుల్ వాదనలు వినిపిస్తూ... ఐపీసీ, సీఆర్పీసీ చట్టాల స్థానంలో నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. వాటి ప్రకారం కలెక్టర్‌కు, ఆర్డీవో తదితరుల అధికారులకు మేజిస్ట్రేట్ అధికారాలు దఖలుపరుస్తూ ప్రభుత్వం ఇప్పటివరకు నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. చట్టం కల్పించని అధికారాన్ని వినియోగించి, ఆర్డీవో ఇచ్చిన నోటీసు చెల్లుబాటు కాదన్నారు.ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఆర్డీవో నోటీసు ఆధారంగా తదుపరి చర్యలను నిలుపుదల చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను మూడువారాలకు వాయిదా వేశారు.

ఆకతాయిల చేష్టలతో మంటలు

- సకాలంలో చేరుకొని అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది



మంటలను ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

ఆరిలోవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల రామకృష్ణాపురానికి ఆనుకొని ఉన్న పాత ఇసుక రీచ్‌లకు సమీపంలో ఉన్న స్థలం వద్ద మంగళవారం మధ్యాహ్నం 11 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఆ సిబ్బంద వచ్చి ఉవ్వెత్తున ఎగసి పడుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ స్థలాన్ని రైల్వే జోన్ సంబంధించిన కేటాయించినది. కొందరు ఆకతాయిలు అక్కడ ఉన్న ఎండిపోయిన తుప్పలకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి ఉండవచ్చని భావిస్తున్నారు. అయతే ఎటువంటి ప్రమాదం, నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రెండేళ్ల కిందట కొంతమంది ఆకతాయిలు ముసడసర్లోవ చేరువ ఎగువ భాగాన ఎండిపోయిన చెట్లకు నిప్పు పెట్టడంతో ఇదే విధంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రాంతంలో ఆకతాయిల అల్లరి చేష్టల వల్ల ఇలా అగ్ని మంటలు చెలరేగుతున్నాయని, వానిఇ అరికట్టాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

వెన్‌కాబ్ ఆధ్వర్యంలో ఎగ్ మేళా



ఉడక బెట్టిన గుడ్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆరిలోవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) ఆరిలోవ అంబేడ్కర్ జంక్షనులో మంగళవారం వెన్‌కాబ్ బ్రీడ్ హెచరీస్ ఆధ్వర్యంలో ఆరిలోవలోగల పాసారికి చికెన్ షాపు వద్ద ఎగ్ మేళా నిర్వహించారు. స్థానికులకు ఉచతంగా ఉడరబెట్టిన గుడ్లను అందజేశారు. జనం అధిక సంఖ్యలో వచ్చి గుడ్లను తీసుకున్నారు.ఈ సదర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత మూడు రోజులుగా నగరంలోని 26 చోట్ల ఈ విధంగా ఎగ్ మేళాను నిర్వహించినట్టు తెలిపారు. చికెన్, గుడ్డు తినడం వల్ల శరీరానికి ప్రోటీన్లు సకూరుతాయని, ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. ఇవి మంచి పోషకాహారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో పరిసరప్రాంతాలకు చెందని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

సిరిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ సమావేశాన్ని మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యంగా ఆర్థిక స్థితిగతులు, త్వరలో జరగబోయే నూతన కమిటీ ఎన్నికల విధి విధానాలు, సంఘం బైలాస్ గురించి చర్చించారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు గొంప చంద్రమౌళి, రంధి సాదురావు, ఆర్.వెంకటరావు, టి.వీరారెడ్డి, కె.నారాయణరావు, ఎన్.సత్యనారాయణ, ఎం.రమేష్, షేక్ శిలార్, పి.సూరిబాబు, జి.వీరభద్రరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రోడ్డు వరకే.. పలాస పాసింజర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక కారణాల దృష్ట్యా విశాఖ, పలాస మధ్య రాకపోకలు తిరిగే పాసింజర్ రైళ్లను తాత్కాలికంగా శ్రీకాకుళం రోడ్డు వరకు నడిచేలా గమ్యాన్ని కుదించినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. మార్చి రెండో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు విశాఖ నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు, తిరుగు ప్రయాణంలోని శ్రీకాకుళం రోడ్డు నుంచి విశాఖ చేరుతుంది. విశాఖ-విజయనగరం పాసింజర్ రైలు మార్చి ఒకటి నుంచి ఏడు వరకు, తిరుగు ప్రయాణంలోని మార్చి రెండు నుంచి ఎనిమిది వరకు పునరుద్ధరించామన్నారు.

27న పారిశుధ్య కార్మికులకు సెలవు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు బుధవారం శివరాత్రి సందర్భంగా విధులు నిర్వహిస్తారని, తమ ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి యధావిధిగా చెత్తను అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ జీవీఎంసీ ఇంచార్జి కమిషనర్ ఎమ్.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి.నరేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివరాత్రి పర్వదినం రోజున పారిశుధ్ధ కార్మికులు విధులకు హాజరై యధావిధిగా వ్యర్థాలను సేకరిస్తారని, మరుసటి రోజు 27న పారిశుధ్య సిబ్బందికి సెలవు దినంగా ప్రకటించమైనదని ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజలు ఆ రోజు తమ వద్దనున్న వ్యర్థాలను వీధులు, బహిరంగ ప్రదేశాలు,, డంపర్ బిన్లలో పడవేయకుండా 28న తమ ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు.

పుణ్య ఫలం... లింగోద్భవ దర్శనం





» జాగరణ, ఉపవాసాలకు ప్రాధాన్యం
» నేడు మహా శివరాత్రి

(సింహాచలం, ఆంధ్రజ్యోతి)

భగవంతుడు అవతరించిన పుణ్యభూమి మన దేశం. వేదభూమిగా వినుతికెక్కి, మహేశ్వరుడు జ్యోతిర్లింగాలుగా వెలసిన కర్మభూమి ఈనేలపై అనునిత్యం 'ఓం నమఃశివాయః' అనే పంచాక్షరీ మహామంత్రం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఫలితంగానే మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవటం ఆచారం. నేడు మహాశివరాత్రి సందర్భంగా శివరాత్రి విశిష్టత ఇది.

మాఘమాస కృష్ణపక్ష చతుర్థశి అర్ధరాత్రి జ్యోతిర్లింగం ఉద్భవించింది. బ్రహ్మ, విష్ణులకు శివుడు శివగీతను ఈ రోజే ఉపదేశించాడు. శివగీతోపదేశ కాలమే లింగోద్భవ కాలం. మ+అఘ అంటే పాపం లేని మాసం అని మాఘమాసానికి అర్థం చెబుతారు. 'నమః శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తే మహాశివుడు పరవశుడవుతాడని శివపురాణం చెబుతోంది. పరమేశ్వరునికి ప్రీతికరమైన రోజుల్లో ముఖ్యమైనది మహాశివరాత్రి. ప్రతి నెలా వచ్చే కృష్ణపక్ష చతుర్దశి ఈశ్వరునికి ప్రీతికరం, దానిని మాసశివరాత్రి అంటారు. ఈశ్వరుడు లింగరూపంలో ఆవిర్భవించిన తిథి ఇది. అందుకే మహాశివరాత్రి రోజున శివరాత్రి వ్రతాన్ని ఆచరించాలని, ఉపవాసం, జాగరణతో స్వామిని అర్చిస్తే అంత్యకాలంలో కైవల్యం లభిస్తుందని శ్రీనాథ కవిసార్వభౌముడు 'శివరాత్రి మహాత్యం' ప్రబంధంలో విశదీకరించాడు.

అభిషేకప్రియుడు శివుడు

శివరాత్రి పర్వదినాన శివునికి షోడశోపచారాలతో మహాన్యాసపూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం చేయాలి. నాలుగు జాములూ శివ పూజచేయాలి. సాయంత్రం నల్లనువ్వుల పిండితో నలుగుపెట్టుకుని అభ్యంగన స్నానం చేసి షోడశోపచార పూజలు ఆచరించాలి. భస్మంతో త్రిపుండ్రాలను శివలింగంపై తీర్చిదిద్ది ఆవాహన, స్వాగత, అర్ఘ్య, పాద్య, ఆచమన, మధుపర్కలు సమర్పించి అభిషేకించాలి. అభిషేక ప్రియః శివః అన్న వాక్యాన్ని అనుసరించి శివునికి పురుషుడు నీటితో అభిషేకించి విభూది పూస్తే స్వామి పరమానంద భరితుడు అవుతాడు.

ప్రముఖ శైవ క్షేత్రాలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో మత్స్యగుండం మత్స్యలింగేశ్వరస్వామి ఆలయం, బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి, చీమలపాడు కల్యాణపోతురాజు, రాంబిల్లి మండలం పంచదార్ల ఉమాధర్మలింగేశ్వరస్వామి, చోడవరం గౌరీశ్వరస్వామి, ఉపమాక లక్ష్మణేశ్వర స్వామి, అప్పికొండ సోమశ్వరాలయం, సింహగిరి క్షేత్రపాలకుడు బాలాత్రిపురసుందరి సహిత త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వర పంచాయతన దేవాలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

లింగోద్భవ పుణ్యదినం

ఏటా మాఘమాస కృష్ణపక్ష చతుర్దశినాడు చంద్రుడు ఆరుద్రా నక్షత్ర యుక్తుడవుతాడు. ఇది శివారాధనకు పర్వదినం. శివపురాణం ప్రకారం పరమశివుడు లింగాకృతిలో ఉద్భవించిన పుణ్యదినమే మహాశివరాత్రి. పంచభూతాలైన పృథ్వీ, నీరు, అగ్ని, వాయువు, ఆకాశ రూపాలలో శివుడు కొలువై ఉన్నాడు. ఆ క్షేత్రాలనే పంచభూత క్షేత్రాలని పిలుస్తారు. మట్టి లింగంగా కంచి క్షేత్రం లో ఏకామ్రనాథుడుగా శివుడు పూజలందుకుంటున్నాడు. శ్రీరంగం సమీపంలోని జంబుకేశ్వరంలో చాముండేశ్వరీ సమేతుడైన జంబుకేశ్వరునిది జలలింగ రూపం. అరుణాచలం పరమేశ్వరునిది అగ్ని లింగ ప్రాభవం. వాయులింగేశ్వరుడిగా శివుడు శ్రీకాళహస్తిలో కొలువుదీరగా, చిదంబరంలో ఆకాశలింగంగా వెలుగొందుతున్నాడు. వీటిలో నాలుగు తమిళనాడులో ఉండగా శ్రీకాళహస్తి మన రాష్ట్రం లో ఉంది.

జాగరణ ప్రత్యేకం

శివరాత్రి రోజున ఉపవాస దీక్ష చేయడంతో పాటు రాత్రి జాగరణ చేసి, శివుడ్ని ఆరాధించాలి. అర్ధరాత్రి లింగోద్భవ కాలం కనుక కనీసం అప్పటివరకు మేల్కొని ఉండి శివుడ్ని పూజిస్తే ఫలితముంటుందని పండితులు చెబుతారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పక్కన సీపీ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీపీ శంఖబ్రత బాగ్చితో కలిసి మంగళవారం సాయంత్రం నిర్వహించిన రహదారి భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాద మరణాలు, క్షతగాత్రులు, ప్రభుత్వం అందజేసిన సాయం తెలుసుకున్నారు. గుర్తు తెలియని వాహనాల ద్వారా ప్రమాదానికి గురైన బాధితులకు అందుతున్న పరిహారంపై సమావేశంలో చర్చించారు. జిల్లాలో మేజర్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, పాఠశాల, కళాశాలల పరిసర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వినియోగంలోకి తేవాలన్నారు. అవసరమైన చోట బస్‌షెల్టర్లతో పాటు భారీ వాహనాలు నిలిపేందుకు ట్రక్-బేల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా పోలీస్, జీవీఎంసీ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రవాణా అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నడిచి వెళుతున్న వ్యక్తిపై దాడిచేసి సెల్‌ఫోన్ అపహరించిన కేసులో ఇద్దరు మైనర్లతోపాటు మరో నిందితుడిని త్రీటౌన్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కమిషనరేట్‌లో మంగళవారం విలేకరులకు ఈ వివరాలను క్రైమ్ ఏడీసీపీ కె.మోహనరావువెల్లడించారు. పెదవాల్తేరులోని మగధ ఎంపైర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మైలపల్లి చంద్రరావు (72) ఈనెల 22న ఫిషింగ్‌హార్బర్ వైపు ఉదయం 4.30 గంటలకు నడచుకుంటూ వెళ్తుండగా ఈస్ట్‌పాయింట్‌కాలనీ పార్క్ లైన్ అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చేసరికి రెండు బైక్‌లపై నలుగురు యువకులు వచ్చి అడ్డగించారు. వారిలో ఒక వ్యక్తి చంద్రరావు వద్ద సెల్‌ఫోన్ లాక్కొని బలంగా నెట్టేయడంతో కిందపడి తలకు బలమైన గాయమైంది. చికిత్స కోసం కేజీహెచ్‌లో చేరి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దర్యాప్తు చేయగా చినగదిలిలోని దీన్‌దయాల్‌పురానికి చెందిన తీడ మోనేష్‌బాబు(19), రెల్లివీధి అంబేడ్కర్‌బొమ్మ, పెయిందొరపేటకు చెందిన ఇద్దరు బాలురు(17) నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. వారి నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మోనేష్‌బాబుని హత్యాయత్నం, దోపిడీ నేరం కింద అరెస్ట్‌చేసి రిమాండ్‌కు, మైనర్లు ఇద్దరినీ జువనైల్‌హోమ్‌కు తరలించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు కూటమి మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చిత్రంలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

» నాయకులు విస్తృత ప్రచారం చేశారు
» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘు వర్మకు కూటమి మద్దతు తెలియజేస్తోందని, ఆయన విజయానికి నాయకులు విస్తృత ప్రచారం చేశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గురువులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 2014లో టీడీపీ అధికారం లోకి వచ్చిన తరువాత పండగ వాతావరణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని రంగాలను భ్రష్టు పట్టించినట్టే విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందన్నారు. మద్యం దుకాణాల వద్ద ఉపాధ్యాయులను కాపలా పెట్టిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. విద్యారంగం అభివృద్ధికి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక డీఎస్సీలు వేసిన ఘనత టీడీపీకి దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను వినలేదని, వారిని గౌరవించలేదన్నారు. విద్యలో నాణ్యత పెంచాలనే ఉద్దేశంతో వీసీలు, డీఈవోలను నియమించినట్టు తెలిపారు. రఘువర్మను గెలిపించాలన్నారు. సమావేశంలో కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

» మొత్తం 22,493 మంది ఓటర్లు
» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



ఎన్నికల ఏర్పాట్లను వివరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు యంత్రాంగం సర్వ సన్నద్ధమైందని, ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని 22,493 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకో నున్నట్టు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, షామియానాలు, మహిళలు, పురుషలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు 48 గంటలు ముందుగానే సైలెంట్ పీరియ డ్ అమల్లోకి వస్తుందని, ఈ సమయంలో ఎవరూ ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించకూడదని, ప్రచారం చేయరాదన్నారు. అదే సమయంలో 144 సెక్షన్ కూడా అమల్లో ఉంటుందన్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ ఉంటుందన్నారు.

123 పోలింగ్ కేంద్రాలు

ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో మొత్తం 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ విధిస్తామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 739 మంది అధికారులను నియమించామన్నారు. వీరిలో 148 మంది పీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారన్నారు. వీరితోపాటు మరో 148 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు.

ఉదయం 8 గంటల నుంచి పోలింగ్

ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి మూడో తేదీన కౌంటింగ్ జరుగుతుందని, ఎనిమిదో తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగిస్తుందని వివరించారు. ఈ నెల 26వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందిస్తామన్నారు. 27వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ సిబ్బంది నుంచి మెటీరియల్ స్వీకరిస్తామన్నారు. బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఈ పరిధిలో ఉండకూడదని, పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకువెళ్ల కూడదన్నారు. హోటళ్లు, లాడ్జిలు, ఫంక్షన్‌హాల్స్‌లో ముందస్తు తనిఖీలు చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఆర్‌వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, తూర్పు ఏసీపీ మూర్తి పాల్గొన్నారు.

ప్రజల రోజువారీ జీవనంలో ఆర్‌బీఐ పాత్ర కీలకం

» స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నా, పరిమితులకు లోబడే విధులు
» ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



మాట్లాడుతున్న దువ్వూరి సుబ్బారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల రోజువారీ జీవనంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలకపాత్ర పోషిస్తోందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు పేర్కొన్నారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం 'సెంట్రల్ బ్యాంకింగ్‌లో సందిగ్ధతలు- భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రజల రోజువారీ జీవితాలతో ఎలా కనెక్ట్ అవుతుంది' అనే అంశంపై ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ (ఐడీఎస్‌ఏపీ) ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు దివంగత రొక్కం రాధాకృష్ణ జ్ఞాపకార్థం స్మారకోపన్యాసానికి ముఖ్య అతిథిగా హాజరైన దువ్వూరి మాట్లాడుతూ దేశంలో ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించడంలో ఆర్‌బీఐ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. నోట్ల ముద్రణతోపాటు మేనేజ్ మెంట్, మానిటరీ పాలసీలను రూపొందించడం, ఎక్స్ఛేంజ్ రేట్లను మేనేజ్ చేయడం, ఆర్థిక సంస్థలు, వ్యవస్థలను, పేమెంట్, సెటిల్‌మెంట్ సిస్టమ్స్‌ను రెగ్యులేట్ చేయడం వంటి కార్యకలాపాలను ఆర్‌బీఐ నిర్వహిస్తుందన్నారు. ప్రజలు తీసుకునే ట్రైన్ టికెట్ నుంచి గృహ రుణానికి చెల్లించే ఈఎంఐ వరకు ఆర్‌బీఐ పాత్ర ఉంటుందన్నారు. బ్యాంకుల్లో ప్రజలు సొమ్ము భద్రంగా ఉందన్నా, విదేశాలకు డాలర్స్ రూ పంలో తీసుకువెళుతున్నారన్నా, గూగుల్ పే వంటి యాప్స్‌లో నగదు బదిలీ అవుతోందన్నా... ఆర్‌బీఐ చర్యలు, నిర్ణయాలే కారణమన్నారు. తాను ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకునే సమయానికి ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు దారుణంగా దెబ్బతిన్నాయని, సవాళ్లను ఎదుర్కొని ముందుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆర్‌బీఐ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థని, కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని కో-ఆపరేటివ్ బ్యాంకులు రాజకీయాల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, మహారాష్ట్ర, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ బలమైన వ్యవస్థలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు, ప్రొఫెసర్ మహేంద్రదేవ్, ఐడీఎస్‌ఏపీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.గలాబ్, ప్రొఫెసర్ సి.సాంబమూర్తి, ప్రొఫెసర్ కె.రామునాయుడు, ప్రొఫెసర్ పి.అప్పారావు, సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్‌లో వేద వ్యాస్‌కు పతకాలు



వేదవ్యాస్

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో నగరానికి చెందిన ఎంఎస్‌జె.వేదవ్యాస్ పతకాలు సాధించాడు. చండీగఢ్‌లో జరిగిన ఈ మీట్‌లో వ్యాస్ పురుషుల ఐదు వేలు, పదివేల మీటర్ల మారథాన్‌లో కాంస్య పతకాలు సాధించాడు. లాంగ్ డిస్టెన్స్ రన్నర్‌గా రాణిస్తున్న వేదవ్యాస్ 33వ సౌత్‌జోన్ జూనియర్ మీట్‌తోపాటు రాష్ట్ర స్థాయి టోర్నీలలో స్వర్ణ పతకాలు కైవశం చేసుకున్నాడు. 10 కి.మీ. క్రాస్ కంట్రీ, 21కి.మీ హాఫ్ మారథాన్ ఈవెంట్లలో స్వర్ణ పతకాలు సాధించడమే కాకుండా రాష్ట్ర స్థాయి ఉత్తమ రన్నర్‌గా గుర్తింపు పొందాడు. అతడిని అధికారులు, సిబ్బంది అభినందించారు.

తిరుపతి తొక్కిసలాట ఘటనపై కొనసాగిన విచారణ

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాటపై జ్యుడీషియల్ విచారణ మంగళవారం కూడా కొనసాగింది. విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జస్టిస్ సత్యనారాయణమూర్తి విచారణ చేపట్టారు. గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం నుంచి ముగ్గురు విచారణలో పాల్గొనవలసి ఉండగా, ఒకరు మాత్రమే హాజరయ్యారు. కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన కండేపల్లి శాంతి (36) భర్త వెంకటేశ్ విచారణకు హాజరైనట్టు తహశీల్దార్ సీహెచ్ రమేశ్ తెలిపారు.

అప్పికొండ సోమేశ్వరాలయం వద్ద పటిష్ఠ ఏర్పాట్లు



అప్పికొండ తీరంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ అశోక్

గాజువాక, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అప్పికొం డ సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు లక్షలకు పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో జీవీఎంసీ, పోలీస్ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. దర్శనానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తుల వాహనాలను నిలిపేందుకు ఆలయానికి కిలోమీటరు దూరంలో నాలుగు చోట్ల పార్కింగ్ కల్పించారు. స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు నుంచి శివాలయం వరకు దారిపొడవునా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. సముద్ర స్నానాలను ఆచరించేందుకు వచ్చే మహిళల కోసం తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేక షెల్టర్లను సిద్ధం చేశారు. అలాగే తీరంలో ఎలాంటి ప్రమా దాలు జరగకుండా స్విమ్మర్ల టీమ్‌ను దింపారు.

అడుగడుగునా పోలీస్ భద్రత

డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ త్రినాథ్‌ల పర్యవేక్షణలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 12 మంది సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 30 మంది ఏఎస్‌ఐలు, 50 మంది హెచ్‌సీలు, 200 మంది కానిస్టేబుళ్లు, 70 మంది మహిళా పోలీసులు, ఏపీఎస్పీ సిబ్బంది, 200 మంది హెచ్‌జీలు బందోబస్తు నిర్వహిస్తారు. సోమేశ్వరాలయం నుంచి తీరం వరకు పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు.

బాధ్యతగా పనిచేయాలి: సీపీ, జేసీ

భక్తులకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు ఆదేశించారు. వీరిద్దరూ శివాలయ ప్రాంగణాన్ని, సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలించారు. స్వామిని సోమవారం రాత్రి సీపీ బాగ్చి, మంగళవారం జేసీ మయూర్ అశోక్ దర్శించుకున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటో చోరీకి పాల్పడిన నిందితుడిని టూటౌన్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరులో ఉంటున్న శాకుంతల లక్ష్మీలావణ్య నగరంలో జరిగిన బంధువుల పెళ్లికి ఈనెల 16న వచ్చారు. అల్లిపురంలో ఆమె తల్లి ఇంటికి వెళ్లి, ఇంటికి తాళం వేసుకుని తల్లితో కలిసి పెళ్లివేదిక వద్దకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపుతాళం విరగ్గొట్టి ఉండడంతో కంగుతిన్నారు. బీరువా తెరిచివుండడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. రూ.1.7 లక్షలు నగదు, పావు తులం బంగారు చెవిరింగులు చోరీకి గురయిందని గుర్తించారు. ఈస్ట్‌క్రైమ్ సీఐ ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా మర్రిపాలేనికి చెందిన షేక్ ఖాదర్ బాషాను నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.39 వేల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ ఎర్రంనాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సివిల్ డిఫెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా జ్యోతి మాధవి

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సివిల్ డిఫెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్.జ్యోతి మాధవిని ప్రభుత్వం నియమించింది. మైనార్టీ సంక్షేమ శాఖలో పనిచేసి, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఆమెకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలి: కలెక్టర్



ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో సమావేశమైన కలెక్టర్

మహారాణిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. ప్రచార ప్రక్రియ ముగిసిన తరువాత మంగళవారం అభ్యర్థులతో సమావేశమయ్యారు. ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి అనుమతుల్లో అనుసరించాల్సిన విధానాలపై సూచనలిచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని కోరారు. పోలింగ్ ఏజెంట్లు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. బూత్‌లోకి కెమెరాలు, సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని సూచించారు. బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ ద్వారా ప్రచారం చేయరాదన్నారు. పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు రోజు డ్రైడేగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో భవానీశంకర్, ఇతర అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.